వురి కోరిన వుత్తరం!

సికిందర్

సరళాదేవి స్వింగ్ డోర్ తెరిచి లోనికెళ్ళి భ్రమాన్వడి పోయింది. లోపల ఎదురుగా టేబిల్ మీద ఆరేళ్ళ వినయ్‌బాబు మోకాళ్ళమీద కూర్చొని, చిందరవందరగా పడివున్న నోట్లను ఏరుతున్నాడు.

అన్నీ వందరూపాయల నోట్లు! వాటి మొత్తం కనీసం అయిదారువేలు వుంటుంది....

సరళ కళ్లు చెదిరాయి. వేగంగా కదిలి టేబిల్ దగ్గరి కెళ్ళింది. వినయ్ ఆమెను గమనించలేదు. ఉత్సాహంగా నోట్లను పేరుస్తూ నిమగ్నమై వున్నాడు.

"వినయ్! ఇవెక్కడివి!" సరళ అర్చింది.

వినయ్ ఉలికిపడి తలెత్తి చూశాడు. వెంటనే అతని కళ్ళు మెరిశాయి. ఆ వెంటనే ముఖంలో గర్వం, సంతోషం చోటుచేసుకున్నాయి.

"ఇవన్నీ నావే! బావున్నాయి కదూ?"

సరళకు మతిపోయినట్లయింది. తేరుకొని అంది:

"వినయ్! నువ్విలా డబ్బు తీయకూడదు! డాడీ చూస్తే కోప్పడతారు!"

"ఈ డబ్బు నాది! ఫో! దూరంగా వుండు నువ్వు?"

సరళ గాభరాగా నోట్లనందుకోబోయింది. వినయ్ ఆమె చేతులు పట్టుకొని ప్రక్కకు నెట్టేశాడు.

"ఏయ్‌! ముట్టుకోకు నువ్వు! నీ ముక్కు కోస్తాను!"

"బాబూ! డాడీ వస్తారు" సరళ బ్రతిమాలింది.

వినయ్ మెరుపులా లేచి, పెన్ స్టాండులోంచి కలం తీసి ఝుళిపించాడు. "నువ్వు ఫో! పొడుస్తాను లేకపోతే!"

సరళ సహనం చచ్చిపోయింది. దుడుకుగా అతని కలం లాక్కుని, అతన్ని లేపి క్రిందకు దింపింది. వినయ్ కెవ్వుమన్నాడు.

అదే క్షణంలో విసనకర్రలా స్వింగ్ డోర్ తెరచుకుంది. సుమారు 45 ఏళ్ళ వయసున్న వ్యక్తి లోనికి జొరబడ్డాడు. సరళ చేతిలో డబ్బు వదిలేసి, గిరుక్కున వెనక్కి తిరిగి చూసి కొయ్యబారిపోయింది.

అతను టేబిల్ మీద నోట్లను, సరళను, వినయ్‌నూ మార్చిమార్చి చూశాడు. క్షణాలు ఉద్రిక్తంగా గడుస్తున్నాయి. సరళ బెదురుతూ చూసి, చిన్నగా గొణిగింది. "సర్, ఈ డబ్బు—వినయ్ తీశాడు."

ఆ వ్యక్తి చటుక్కున వినయ్‌ని చూశాడు. వినయ్ ఒక్క దూకులో వెళ్ళి తండ్రి చెయ్యి పట్టుకున్నాడు.

"డాడీ! ఆ డబ్బు నేనే తీశాను! నాకివ్వవూ?"

ఆ వ్యక్తి సరళను ప్రశ్నార్థకంగా చూసి, "ఏమిటిది! ఈ డబ్బు బయటికెలా వచ్చింది?" అన్నాడు తీవ్రంగా.

"ఏమో! వినయ్ తీశాడు .... వినయ్! ఎక్కడిది వినయ్?"

పసివాడు ఉషారుగా నవ్వాడు. చెయ్యెపెట్టి ఎదురు గోడకున్న షెల్ఫ్‌లో హాండ్‌బ్యాగును చూపించాడు.

"అందులోంచి తీశానూ!"

సరళ అదిరిపడింది. ఆ వ్యక్తి విసురుగా షెల్ఫ్ దగ్గరికి నడిచాడు.

సరళకు వున్నట్టుండి చెమటలు పట్టాయి. నిల్చున్న చోట విగ్రహంలా వుండిపోయింది.

ఆ వ్యక్తి బ్యాగునందుకొని తెరిచి చూశాడు. అతని కళ్ళు ఉలికిపడ్డాయి. గబగబ దానితో టేబిల్ దగ్గరికొచ్చి అందులోని వస్తువుల్ని గుమ్మరించాడు.

సరళ కళ్ళప్పగించి చూస్తోంది. వినయ్ టేబిల్ ఎక్కి ఆసక్తిగా చూస్తున్నాడు.

ఆ వ్యక్తి క్రిందపడ్డ వస్తువుల్లోంచి ఒక తాళంచెవి ఏరి తీశాడు.

వెంటనే జేబులోంచు తాళాల గుత్తితీసి చూసుకున్నాడు. అతని ముఖం కందగడ్డలా మారింది. సరళ నోరు తెరిచిపెట్టి చూస్తోంది. అతను తాళం చెవితో టేబిల్ సొరుగు లాగి, లోనికి తొంగిచూశాడు. ధడాలున సొరుగు లోనికి నెట్టేసి తల పైకెత్తాడు:

"రాక్షసీ! నా తాళంచెవి దొంగిలించి డబ్బు తీయడానికి నీకెంత ధైర్యం!"

సరళ మాట్లాడలేదు. ఆమె మాట్లాడే స్థితిలో లేదు. ఆ షాక్‌నుంచి ఇంకా కోలుకోలేదు.

అతడు ఫోనందుకున్నాడు. "నీ అంతు చూస్తాను!" ఉద్రేకంతో డయల్ చేస్తూ, "నీలాంటి మోసగత్తెను సహించను!" అనర్చి, "హలో....పోలీస్?" అన్నాడు.

అప్పుడుగానీ సరళ తేరుకోలేదు. లేడిలా ముందుకు

గొంతి, ఫోను పట్టుకుంది. "నన్ను నమ్మండి! ఆ డబ్బు నేను తీయలేదు! పోలీసుల్ని పిలవకండి!" అనర్చింది ఉద్రేకంగా.

అతనామె గడ్డంక్రింద చెయ్యిపెట్టి వెనక్కి నెట్టాడు. ఆమె విసురుగా వినయ్ ఫాళ్ళో పడింది. వినయ్ ఆమెను దూరంగా నెట్టేస్తూ, "నువ్వు చెడ్డదానివి!" అన్నాడు.

ఆ వ్యక్తి ఫోన్‌లో గబగబ మాట్లాడుతున్నాడు, "ఇన్‌స్పెక్టర్! త్వరగా రావాలి! గ్లోబ్ ఫైనాన్సింగ్ కంపెనీ, అరోరా బిల్డింగ్స్, ఆబిడ్స్. నేను విష్ణుకాంత్-ప్రొప్రయిటర్ని మాట్లాడుతున్నాను. ఇక్కడ దొంగతనం జరిగింది...."

సరళ అతని మాటలు వింటూ, తీవ్రంగా ఆలోచిస్తూ ఉలిక్కిపడింది. అతను ఫోను పెట్టేశాక, గభాల్న అందుకొని గబగబ డయల్ చేయసాగింది. అతను తీక్షణంగా చూస్తున్నాడు.

"హలో, ట్విన్ సిటీస్ డిటెక్టివ్ ఏజెన్సీ....?"

"యస్, వాటీజిట్ యూ వాంట్, మాడమ్?"

"మిస్టర్ లాల్ కావాలి!" అంది సరళ ఉద్వేగంగా.

2

లాల్ చెయ్యి చాపి, జాన్ చేతిలో ఫోన్ అందుకొని "యస్, లాల్ హియర్" అన్నాడు ఓపిగ్గా. ఆ తర్వాత అవతలి మాటలు రెండు నిమిషాలు శ్రద్ధగా విని, "నిరూపణ అయ్యేవరకూ యెవరూ నేరస్థులు కాలేరు, మిసెస్ సరళ. నిర్భయంగా ఉండండి! మేం వెంటనే వస్తున్నాం" అని రిసీవర్ పెట్టేసి లేచాడు.

"గెటప్! ఆమెని పోలీసులు అరెస్టు చెయ్యబోతున్నారట—బూటకపు నిందలతో! లెటజ్ రన్."

గ్లోబ్ ఫైనాన్సింగ్ కంపెనీ ఆఫీసులో ఇద్దరు ఆబిడ్స్ సబ్ యిన్ స్పెక్టర్లు డిటెక్టివ్ లను విష్ చేశాడు.

"గుడ్ మార్నింగ్. కానీ మిస్టర్ లాల్, ఆమె కిప్పుడు కావల్సింది మీరు కాదు, లాయర్. ఆమెని అరెస్టు చేసి తీసుకెళుతున్నాం. బెయిల్ ప్రయత్నాలు చేసుకోవాలంటే—"

నాథ్ మాటలకి సరళ అడ్డుపడి అర్చింది, "మీరు నన్ను అరెస్టు చెయ్యలేరు! ఆయన మాటలు విని నన్నేమీ చేయలేరు! అంతా అబద్ధం! ఆ డబ్బు ముమ్మాటికీ నేను తీయలేదు. నేను తీసివుంటే ఆ షెల్ఫులో కన్పించేలా ధైర్యంగా పెడతానా?"

"మిస్టర్ లాల్! వీళ్ళు ఆలోచించకుండా ప్రవర్తిస్తున్నారు! బాస్ మాటల్లో ఏమాత్రం నిజం లేదు. వీళ్ళు ఆయన్ను ప్రశ్నించడంలేదు! అంతా ఆయన పలుకుబడి! మీరు నిలదీసి అడిగి అసలు నిజం బయటపెట్టండి! ఆ డబ్బు నేను తీయలేదు గాక తీయలేదు! అంతే!"

డిటెక్టివ్ లు సాలోచనగా చూపులు మార్చుకొన్నారు.

జాన్ పెదవులు చప్పరించి అన్నాడు. "మిస్టర్ విష్ణుకాంత్, తొందరపడి మీ ఉద్యోగుల వ్యక్తిత్వాన్ని ఖూనీ చెయ్యకండి! మీకే నష్టం. ఏ సందర్భంలోనైనా యిదివరలో ఆమెపట్ల మీకు అపనమ్మకం మేర్పడిందా? యెప్పుడైనా ఆమె అనుమానాస్పదంగా ప్రవర్తించిందా?...."

విష్ణుకాంత్ అడ్డంగా తలూపాడు. "లేదు, ఆమెని బాగా నమ్మాను. కానీ, యిప్పుడామె విశ్వాసఘాతం ఇలా కళ్ళముందు స్పష్టమవుతోంటే ఇంకా ఆత్మవంచన

చేసుకోమంటూరా?"

"ఆమె డబ్బు తీసిందని మీకెలా తెలిసింది? ఎక్కడ నుంచి తీసింది?"

"నా సొరుగులోంచి.... రాత్రి ఈ డబ్బు ఆమె కళ్ళ ముందే సొరుగులో పెట్టి తాళం వేశాను. ఇప్పుడిక్కడి కొచ్చి ఆ దృశ్యం చూసి కొయ్యబారి పోయాను. నా కుమారుడు—వినయ్—టేబిల్ మీద కూర్చొని వున్నాడు. అతని ముందు నోట్లు చిందరవందరగా పడి వున్నాయి. అతనితో సరళ వాదిస్తోంది. తేరుకొని నిలదీసి అడిగాను. తనకేమీ తెలియదంది. ఆ డబ్బు వినయ్ తీసినట్లు చెప్పింది. కానీ వినయ్ షెల్ఫులో ఆమె బ్యాగును చూపించి, అందులోంచి తీశానన్నాడు. వెంటనే నేను బ్యాగు తెరిచిచూశాను—అందులో సొరుగు తాళంచెవి దొరికింది!"

"కాబట్టి ఆమె తీసిందనుకుంటున్నారు...."

"నమ్మకంగా!"

"ఆ తాళంచెవి మీ రెప్పుడు పోగొట్టుకొన్నారు?"

"ఆమె బ్యాగులో చూసేవరకూ పోగొట్టుకొన్నట్టు తెలియలేదు!"

"అయితే రాత్రి యెవరో దొంగిలించి వుంటారు."

"ఎవరో కాదు—సరళ మాత్రమే."

"ఓహ్, అయితే ఆమె రాత్రి మీ ఇంటికి రహస్యంగా వచ్చిందంటూరా?"

"ఆమెనే అడగండి!"

"అవసరం లేదు! రాత్రి ఆమె మీ యింటికి రాలేదు."

"మీకెలా తెలుసు?"

"నాకు తెలుసు. మీరొక మామూలు విషయం ఆలోచించలేరా? ఈ డబ్బు ఆమె దొంగిలించి వుంటే మీ ఆఫీసులోనే, మీ ముందు షెల్ఫులో ధైర్యంగా పెడుతుందా! నేరానికి పాల్పడ్డ వాళ్ళ అంతరంగమెలా వుంటుంది? తాళంచెవి రాత్రి దొంగిలించి వుంటే డబ్బు రిస్క్ లేకుండా అప్పుడే తీయగలదు. ఆఫీసు తాళాలు ఆమెదగ్గరే వున్నట్టు మీకంటే ముందు ఆమె రాకనుబట్టి అర్థమవుతోంది. మీ కుమారు డెక్కడ? అతనిక్కడెందుకొచ్చాడు? ఆమె బ్యాగు నెందుకు తెరిచాడు?"

విష్ణుకాంత్ చల్లబడ్డాడు. "అతన్నింటికి పంపేశాను. ఇక్కడ పోలీసుల ముందు జడుసుకుంటాడు—చిన్న పిల్లాడు. ఉదయం కొత్త బూట్లు కావాలని గొడవ చేస్తోంటే సుభాష్‌తో ఇక్కడికి పంపాను. వెనుక నేను వచ్చాను."

"సుభాష్ ఎవసు?"

"నా బావమరిది."

"వాళ్ళు వచ్చినప్పుడు ఈ గదిలో ఎవరున్నారు?"

"ఎవరూ లేరు," అంది సరళ. "నేను 9 గంటలకు ఆఫీసు తెరిచాను. బ్యాగు యెప్పటిలాగే షెల్ఫులో పెట్టి బయట అకౌంటెంట్‌తో మాట్లాడుతున్నాను—స్టాఫ్ రూంలో. ఇంతలో సుభాష్, వినయ్ వచ్చారు. ఇద్దరూ చాలాసేపు యీ గదిలో వున్నారు. సుమారు అరగంట తర్వాత సుభాష్ గాభరాగా బయిటికొచ్చి వెళ్ళిపోయాడు—"

"ఎందుకు?"

"తెలియదు. నేను పట్టించుకోలేదు. అతనంటే నాకిష్టంలేదు. అతని మాటలు, చేతలు నాకు నచ్చవు. ఒక

సారి నా చెయ్యి పట్టుకుంటే చెంప వాయించాను. అప్పటి నుంచీ నామీద కసిగా ఉంటున్నాడు."

జాన్ తలతిప్పి లాల్ ని చూశాడు. లాల్ హాండ్ బ్యాగును పరిశీలిస్తున్నాడు.

విష్ణుకాంత్ ముఖం ఎర్రబడింది.

"ఈ విషయం నా కెందుకు చెప్పలేదు?" అన్నాడతను.

"ఇతరులకి చెప్పుకునే అలవాటు నాకు లేదు. ఎవర్ని యెలా అదుపుచేయాలో నాకు తెలుసు" అంది సరళ.

"అయితే అతనెందుకలా వెళ్ళిపోయాడు?" జాన్ అడిగాడు.

"ఏమో, తెలియదు! మళ్ళీ రాలేదు. అతను వెళ్ళిన కాస్సేపటికి నే నిక్కడ కొచ్చి చూస్తే— టేబిల్ మీద వినయ్—డబ్బుతో—"

"నెవర్ మైండ్" జాన్ ఇన్ స్పెక్టర్ వేపు తిరిగాడు, "వెల్, యీ సుభాష్ వ్యవహారం గురించి చెప్పే అవకాశం మీరామెకు యివ్వలేదనుకుంటాను.... యింతకంటే స్పష్టంగా యేం తెలియాలి? మీరు తక్షణం సుభాష్ని ఎందుకు గాలించకూడదు?"

ఇన్ స్పెక్టరిద్దరూ మొఖాలు చూసుకున్నారు.

లాల్ చిన్నగా నవ్వి విష్ణుకాంత్ ని చూశాడు.

"షటప్! మీరేమీ చెయ్యకండి! వెళ్ళండిక్కడ్నించి! ఈ పని వాడు చేసివుంటే వాడి సంగతి నేను చూస్తాను. ప్లీజ్! గెటవుట్! జరిగిందానికి నేను చాలా సిగ్గుపడుతున్నాను. అయాం సారీ, సరళా! ముందూ వెనుకా ఆలోచించలేదు నేను—అయాం వెరీ సారీ!"

"యూ డర్టీ చీట్! యెవర్నిరా దొంగ అంటు

న్నావు?"

ఒక లావుగా, పొట్టిగా వున్న యువకుడు బిగ్గరగా అరిచి లోనికొచ్చాడు విసురుగా.

3

అందరూ ఉలికిపడి అతన్ని చూశారు. అతనికి 30 యేళ్ళుంటాయి. తెల్లగా దృఢంగా వున్నాడు. దానికి తోడు కట్టలు తెంచుకొంటున్న ఆవేశం. అతని పిడికిళ్లు గట్టిగా బిగుసుకొని ఉద్రేకంతో విపరీతంగా కంపిస్తు న్నాయి.

సరళ అతన్ని చూసి నోరు తెరిచి అరవబోయింది.

అతను విష్ణుకాంత్ దగ్గరకొచ్చి కళ్ళలో నిప్పులు కురి పిస్తూ మళ్ళీ అర్చాడు.

"ఎవర్నిరా దొంగ అంటున్నావు, యూ చీట్! నువ్వే దొంగవి! మోసగాడివి! నీ కంపెనీ ఫ్రాడ్! దగా కోరు! జనాన్ని నిలువునా దోచేస్తున్నావు! నువ్వే నా భార్యని దొంగంటావా? నిన్ను—నిర్మూలం చేస్తానో చూడు!"

అతను ఛటుక్కున ముందుకు జరిగి విష్ణుకాంత్ కంఠం పుచ్చుకొన్నాడు.

సరళ కెవ్వుమనర్చింది. ఇన్‌స్పెక్టర్లు అతన్ని వెనక్కి లాగారు.

"నో! నిన్ను వదలను! నీ అంతు చూస్తాను! నీ కుటుం బంలో ఒక్కొక్కర్ని కౌబాయ్ హీరోలా నాశనం చేస్తాను! సవాల్! ఇదే సుధాకర్ శపథం!"

"షటప్! షటప్ ఐ సే!" జాన్ అర్చాడు, కల్పించు కొని, "మీ రెవరిముందు బెదిరిస్తున్నారో తెలుసా? ఇక్క డిద్దరిన్‌స్పెక్టర్లున్నారు!"

"ఓహ్, వీళ్ళేం చేస్తారు! నా శపథం నెరవేరాక నేనే వీళ్ళను పిలుస్తాను!"

"మీరు పిచ్చిగా అరుస్తున్నారు! నోర్మూసుకోండి!" సరళ వారించింది.

"ఇన్‌స్పెక్టర్! మీరతని బెదిరింపు విన్నారు. ఇంకా చూస్తారేమిటి? వెంటనే అరెస్టు చేయండి!"

ఇన్‌స్పెక్టర్లు తికమకపడి, సుధాకర్ రెక్కలు విరిచి పట్టుకొన్నారు.

"లాల్! ఆయన్ను విడిపించండి! ఆయన యేమీ చెయ్యడు! ఆయన ఆవేశం అలాటిది! ఉద్రేకం తప్ప ఆయనకే ఉద్దేశం లేదు! ప్లీజ్....విడిపించండి!" అంది సరళ ఆవేదనగా.

"అతన్ని వదలండి!" జాన్ ముందుకెళ్ళి అన్నాడు, "అతనేమీ చెయ్యడు. అతని అభిమాన హీరో నటించిన సన్నివేశాన్ని ప్రదర్శించి చూపుతున్నాడు. బడ్‌స్పెన్సర్ యిలాగే చేస్తాడు....హాట్సాఫ్, మిస్టర్ సుధాకర్! మీ హీరో అతనేనా?"

"ఏమిటీ! నేను మరొకర్ని ఇమిటేట్ చేస్తున్నానను కుంటున్నారా? అయితే వేచిచూడండి! నా అడ్వెంచర్స్ మీ అంతు చిక్కవ్!" అర్చాడు గింజుకుంటూ.

"మిస్టర్! మీరింకేమీ చేయనవసరంలేదు. మీ బెది రింపులకు సెక్షన్ 336 ఆహ్వానిస్తోంది. మూడు నెలలు జైల్లో మగ్గుదురుగాని- పదండి!" గుండూరావ్ గాండ్రించి అతన్ని ముందుకు తోశాడు.

సరళ ఈసారి బలహీనంగా అర్చింది.

అంతవరకూ సుధాకర్ ఉద్రేకాన్నీ, దుడుకుతనాన్నీ, అతని ప్రవర్తనలోని నాటకీయతనూ మౌనంగా గమని

స్తోన్న లాల్, అప్పుడు కల్పించుకొని అన్నాడు:

"ఇన్‌స్పెక్టర్, సుధాకర్‌ని వదిలిపెట్టండి. ఇలాటి పరిస్థితిలో యెవరైనా యిలాగే ప్రవర్తిస్తారు. కాకపోతే స్వభావాన్నిబట్టి ప్రవర్తన మారుతుంది. సుధాకర్‌కు ఉద్రేకం యెక్కువ. ఉద్రేకంలో అతనేం మాట్లాడుతున్నాడో తెలియదు. కానీ చల్లబడ్డాక యిలా ప్రవర్తించినందుకు విచారిస్తాడు. అంతేనా సుధాకర్?"

"నా భార్యను నిందించినవాడ్ని సహించను!"

"వెల్. మిస్టర్ వి. కాంత్ త్వరపడి మీ భార్యను నిందించారు. కానీ,తర్వాత క్షమాపణ చెప్పుకున్నారు...."

"క్షమాపణతో పరువు తిరిగిరాదు!"

"అలా అనుకొంటే పరువు నష్టం దావా వేయవచ్చు."

"పలుకుబడి, హోదా ఉన్న వాళ్ళమీద అది ఫలించదు!"

"అయితే ఏం చేస్తారు?"

"ఏం చేస్తానో ఆలోచిస్తాను!" అతను భార్య చెయ్యి పట్టిలాగాడు, "నడువ్! దగాకోరు కంపెనీల్లో ఉద్యోగాలిలాగే వుంటాయి!"

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక లాల్, వి. కాంత్‌తో అన్నాడు,"మీరు సుధాకర్‌గురించి భయపడుతున్నారా? ఇంతమందిలో—పోలీసుల ముందు బెదిరించిన వ్యక్తి ఏ అఘాయిత్యానికీ పూనుకోడు—మీరు నిశ్చింతగా ఉండండి. అతనిది వొట్టి బెదిరింపు మాత్రమే. యింటికెళ్ళాక అందుకతని భార్య అక్షింతలు వేస్తుంది. యేమంటారు?"

"కాని అతను నన్నూ, నా కంపెనీని ఎందుకలా మోషిం చాడు?"

"తమ కేదైనా నష్టం వాటిల్లితే మంచివాళ్ళు సైతం చెడ్డవాళ్ళుగా కన్పిస్తారు."

"సరే, సుధాకర్ గురించి నాకు తెలుసు. అతను పని చేసే ఆఫీసులో బాస్‌ని వొకసారి యిలాగే బెదిరించి ఉద్యోగం పోగొట్టుకున్నాడు. తర్వాత పశ్చాత్తాపంతో కాళ్ళు పట్టుకొని మళ్ళీ చేరాడు. మీ రతన్ని అరెస్టు కాకుండా కాపాడారనుకోకండి. మీరు లేకపోయినా అది జరిగేదికాదు. సుధాకర్ యెంత మొనగాడో నాకు బాగా తెలుసు!" అన్నాడు వి. కాంత్.

4

ఇంకే ఫిర్యాదులు రాకపోవడంతో గ్లోబ్ ఫైనాన్సింగ్ కంపెనీ వ్యవహారం యిక ముగిసినట్లేనని డిటెక్టివ్‌లు మర్నాడుదయం పాత కేసుల్లో ముట్టవల్సిన ఫీజుల విషయమై ఆందోళనపడుతోండగా కృష్ణన్, క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్, ఫోన్ చేసి వి. కాంత్ అనుకోని ప్రమాదానికి గురై మరణించాడని తెలియజేశాడు.

లాల్ కలవరం చెందాడు.

కృష్ణన్ వివరాలు చెపుతూ వి. కాంత్ సరిగ్గా 10 గంటలకు ఆఫీసు మెట్లెక్కుతూ జారి పడిపోయాడని అన్నాడు. స్టాఫ్ అతన్ని చూసి హార్టు ఫెయిల్యూర్ అనుకున్నారు. అతనికి కొన్ని నెలలుగా గుండె జబ్బు ఉంది.

అతను మెట్లెక్కుతున్నప్పుడు ఆ ప్రాంతాల ఎవరున్నారని ఆతృతగా అడిగాడు. అతను పూర్తిగా క్రిందికి పడ్డాక అప్పుడే వచ్చిన క్లర్క్ ఆ ప్రాంతాల ఎవరినీ చూడలేదని కృష్ణన్ అన్నాడు.

లాల్ మళ్ళీ యెవరైనా గాభరాగా బయిటికొస్తుండగా చూశారా అనడిగాడు. లేదని కృష్ణన్ చెప్పాడు. అతను మెట్లెక్కుతున్నప్పు డక్కడెవరూ లేరు.... దాదాపు పూర్తిగా చేరుకొనే సమయంలో స్వయంగా దొర్లిపడ్డాడు.

క్రిందపడిన వెంటనే మూర్ఛపోయాడు-హాస్పిటల్ లో చేర్చాక అరగంటలో ప్రాణం విడిచాడు. డాక్టర్ పరీక్షించి హార్టు ఫెయిల్యూర్ కాదనీ, విషప్రయోగం జరిగిందనీ అన్నాడు.

లాల్ కు ఇదింకా ఆశ్చర్యం కలిగించింది. అతను ఉదయం యేం తిన్నాడు? టిఫిన్ చేశాడు. ఎన్నిగంటలకి? తొమ్మిది గంటలకి. ఇంటికి కబురు చేశారా?

ఇంట్లో యెవరూ లేరు. రను అనే అమ్మాయి మాత్రం రెస్పాన్స్ యిచ్చింది. ఆమెకు వి. కాంత్ మరణం తెలియజేయలేదు. సీరియస్ గా ఉన్నట్టు చెప్పారు. మృతుడి భార్య బయటికెళ్ళినట్టు ఆమె చెప్పింది.

లాల్ నిట్టూర్చి, ఇంటి అడ్రసు తెలుసుకొని ఫోను పెట్టేశాడు.

జాన్ వెంటనే సరళ యింటికి ఫోన్ చేసి సుధాకర్ ఎక్కడ వున్నాడని అడిగాడు. ఆఫీసులోనని చెప్పిందామె. ఆఫీసులో సుధాకర్ రెస్పాన్స్ ఇచ్చాడు.

"హలో, జాన్! ఏమిటి విషయం?"

"మీ శపథం—కాదు—మీ రనుకున్నట్టే జరిగింది!—"

"ఓహ్, ఏం జరిగింది?"

"మీకు తెలియదా? నిన్నటి బెదిరింపు—ఇవాళ వి. కాంత్ కి విషం యిచ్చారు. అతను ఆఫీసు మెట్లెక్కుతూ

పడిపోయి చనిపోయాడు."

ఒక్క క్షణం నిశ్శబ్దం. "నో జాన్! పొరబడ్డారు! నేనతనికి విషం ఇవ్వలేదు! అతనికి గుండెజబ్బు ఉంది! అతను మెట్లెక్కి వస్తున్నప్పుడు నేనే గుండెలు మీద బాది నెట్టేశాను! అతను దొర్లిపడి చచ్చిపోయాడు! అలా చంపాను! నా శపథం అలా నెరవేరింది!"

"షటప్!విషప్రయోగం జరిగింది-డాక్టర్ అన్నాడు" జాన్ అర్చాడు.

సుధాకర్ పకపక నవ్వాడు. "యూ ఆరే ఫూల్, మిస్టర్ జాన్! అయాం ష్యూర్!"

జాన్ రెచ్చిపోయి రిసీవర్ విసిరికొట్టాడు.

5

రమ తలుపుతీసి ఆశ్చర్యంగా చూసింది:

"మీరు——మీరు——లాల్ అండ్ జాన్ కదూ?"

"అవును, పరిచయం చేసుకొనే శ్రమ తప్పింది!" అన్నాడు లాల్.

ఆమె అయోమయంగా దారికడ్డం తొలిగి, తలుపు విశాలంగా తెరిచింది.

"రండి!....రండి!....మీరిలా రావడం...."

"ఇన్స్పెక్టర్ నీకు ఫోన్ చేశాడు, వి. కాంత్ గురించి. ఆయన నీకేమవుతాడు?"

ఉలికిపడిందామె. "ఏమీకాడు! అంకుల్ అని పిలుస్తాను. నేను——ఆయన——ఆయన కుమారుడికి ఆయాగా వుంటున్నాను."

జాన్ నవ్వాడు: "చాలా చిన్నవయసులో, పాపం."

లాల్ లోని కడుగువేశాడు. ఆమె సోఫా చూపించి, "కూర్చోండి!" అని వెనక్కితిరిగి గట్టిగా అర్చింది.

“అవ్వా! త్వరగా రెండు బోర్నవీటా కలుపు!”

డిటెక్టివ్‌లు కూర్చున్నారు. వాళ్ళను తదేకంగా మార్చిమార్చి చూస్తున్న ఆమె ముఖంలో రంగులు వేగంగా మారిపోతున్నాయి. ఆమెకు పదిహేడేళ్లుంటాయి. ఊదా రంగు లంగా, అదే రంగు జాకెట్, పసుపురంగు వోణీలో ఆకర్షణీయంగా; అపరంజి బొమ్మలా వుంది.

“చెప్పండి, ఆయనకెలా వుంది?” అడిగిందామె ఘటుక్కున, “ఇంట్లో ఎవరూ లేరు—అంటీ బయటికెళ్ళింది.”

“ఆయనచనిపోయాడు” అనేసి వూరుకున్నాడు లాల్.

ఆమె బలహీనంగా అర్చి క్రింద కూలబడింది.

“ఆయన చనిపోయారా! చని....ఓహ్, అవ్వా—ఓ అవ్వా—”

ఆమె ముఖం చేతుల్లో దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

లాల్ ఆమెని కాసేపు ఏడ్వనిచ్చాడు. ఆమె ముఖం మీద చేతులు తీసేసి, తల పైకెత్తాడు. కన్నీళ్ళతో ఆమె చెంపలు తడిసిపోయాయి.

“ముఖం తుడుచుకో, లేచి సోఫాలో కూర్చో. నువ్విక్కడెంతకాలం నుంచి వుంటున్నావు?”

ఆమె దుఃఖాన్నాపుకుంది. అయినా వెక్కిళ్లు తగ్గలేదు. ముఖం తుడుచుకొంటూ లేచి సోఫాలో కూర్చుని అంది:

“ఆరునెలల నుంచీ వుంటున్నాను. అంకుల్ నన్నెంతో అభిమానంగా చూస్తాడు. నా కిక్కడెవరూ లేరు. ఇంటర్ చదువుతున్నప్పుడు అన్నయ్యకు జంషెడ్‌పూర్‌లో ఉద్యోగం వచ్చింది. వెళ్ళిపోయాడు. నాకు చదువుమీద శ్రద్ధలేక పరీక్ష తప్పాను. అన్నయ్య వెంటనే వచ్చేయమన్నాడు.

"కానీ, ఇక్కడ అనుకోనిది జరిగింది.... ఒకరోజు సాయంత్రం బస్సుకడ్డంగా వెళ్ళిన ఆరేళ్ళ అబ్బాయిని కాపాడి ఇంటికి తెచ్చాను—ఇదే ఇల్లు-ఆ పిల్లాడు వినయ్ బాబు. అతని తండ్రి నన్ను అభినందించి వివరాలడిగారు. నా పరిస్థితి తెలుసుకొని ఆయన ఇక్కడే వుండి పొమ్మన్నారు—వినయ్ బాగోగులు చూసుకుంటూ.

"నేను అన్నయ్యకు వ్రాశాను. మంచి వాతావరణంలో, మంచిమనుషుల మధ్య వున్నంతవరకూ తన కభ్యంతరం లేదని సమ్మతం తెలియజేశాడు. నాకిక్కడ బాగానే వుంది—ఒక్క సుభాష్ విషయంలో తప్ప. వినయ్‌ను నేను రక్షించిన రోజునుంచి నన్ను ద్వేషిస్తున్నాడు. ఆ రోజు వినయ్ కోసం స్కూలుకెళ్ళక షికార్లు తిరిగినందుకు అంకుల్ అతన్ని బాగా తిట్టాడు—"

లాల్ ముందుకు వంగాడు, "అలాగే నిన్నగానీ, ఇవాళ ఉదయంగానీ తిట్టాడా?"

రమ తలూపింది. "అవును, ఆఫీసులో ఏదో డబ్బు విషయంగురించి బాగా కోప్పడ్డాడు—నిన్న రాత్రి. ఆయనకు గుండెజబ్బు వుంది. చాలా బలహీనం. ఉద్రేక పడకూడదు. రాత్రి ఆయన అంత ఉద్రేకపడినా అంటీ కలుగజేసుకోలేదు. పైగా తమ్ముడ్ని సమర్థించింది. ఆ ఉద్రేకంతోనే ఆయన గుండె అలసిపోయి...."

ఆమె కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి.

"ఆయన చావుకాక్కారణం గుండెజబ్బు కాదు—విష ప్రయోగం."

"ఓహ్, ఏమిటీ!" రమ ఛెంగున లేచింది, "ఆయనకు విషం ఇచ్చారా? ఎవరు! ఎలా! ఆయన్ను చంపాలనుకున్నంత దుర్మార్గులెవరున్నారు?"

"అది తెలుసుకోవడానికే వచ్చాం. ఉదయం ఆయన టిఫిన్ చేశాడా?"

"చేశారు—"

"ఏం తీసుకున్నాడు?"

"గోధుమరొట్టె, ఆమ్లెట్, కాఫీ."

"ఎవరిచ్చారు?"

"అందరికోసం నేనే టేబిల్ మీద సర్దాను."

"ఆయనతోబాటు ఎవరెవరు కూర్చున్నారు?"

"ఆంటీ, సుభాష్, వినయ్, అంతే."

"ఆంటీ పేరేమిటి?"

"రేణుక."

"ఆ గోడమీద ఫోటో ఆమెదేనా?"

"కాదు—ఆమె మొదటి భార్య. చనిపోయింది."

"ఐసీ, రేణుక రెండవ భార్యన్నమాట."

"అవును, ఆమె అంటే నా కిష్టంలేదు."

"వినయ్ ఎవరిబిడ్డ?"

"మొదటి భార్యకు కలిగాడు."

"ఆయన రెండవపెళ్ళి ఎప్పుడు చేసుకున్నాడు?"

"రెండేళ్ళయిందనుకుంటాను...."

"రేణుక ఎలాటిది?"

"అంకుల్ గురించి ఆమె పట్టించుకోదు! ఎప్పుడూ పైన గదిలో కూర్చుని చదువుకుంటూ వుంటుంది. ఆమె డబ్బు కోసం పెళ్ళి చేసుకుంది....ఆ డబ్బు చేతికందే సమయం కోసం నిరీక్షిస్తూ కాలక్షేపం చేస్తోంది."

కిచెన్లో వంటవ్వ కేకేయడంతో రమ వెళ్ళి రెండు కప్పులతో తిరిగివచ్చింది.

డిటెక్టివ్ లు కప్పులందుకొని పీల్చసాగారు.

"ఆంటీ ఇప్పుడెక్కడికి వెళ్ళింది?" లాల్ అడిగాడు.

"ఆమెకో ఫ్రెండ్ వున్నాడు. అతనితో షాపింగ్ కెళ్ళింది. సుభాష్ వినయ్‌ని స్కూలుకు తీసికెళ్ళాడు. రాత్రి నుంచీ అతను చాలా కోపంగా, కసిగా వున్నాడు. ఉదయం టిఫిన్ చేస్తున్నప్పుడుకూడా అంకుల్‌ని క్రూరంగా చూశాడు——"

"అతనేం చేస్తుంటాడు?"

"ఏమీ చెయ్యడు. తిని తిరుగుతుంటాడు."

"రేణుకకు ఫ్రెండ్ వున్నట్లు అంకుల్‌కు తెలుసా?"

"తెలుసు——అతనిక్కడికి కొస్తుంటాడు."

లాల్ లేచాడు. "ఒకసారి డైనింగ్ రూం చూడాలి, ఎక్కడుంది?"

రమ తటపటాయించింది: "సుభాష్ ఆయనకు విషం ఇచ్చాడనుకుంటున్నారా? అవును! నేనూ అదే అనుకుంటున్నాను. ఆ అక్కాతమ్ముళ్ళను చూస్తోంటే ఏదో రోజున ఏదో ఘోరం తలపెడతారనిపించేది....ఇప్పుడదే జరిగింది! అంకుల్‌తో నా మనసులో మాట చెప్పాను. కానీ ఆయనకు ఆంటీ అంటే చాలా ఇష్టం. నేనిప్పుడు సుభాష్‌ని అనుమానిస్తున్నాను....దుర్మార్గుడు! వాడాపని చేస్తున్నప్పుడు నేనుగనుక చూసి వుంటేనా...."

పేలవంగా, పటుత్వంలేని ఆమె మాటలు వింటూ డిటెక్టివ్‌లు డైనింగ్ రూంలోకి నడిచారు.

అక్కడ కిటికీ వారగా టేబిల్ చుట్టూ నాలుగు కుర్చీలున్నాయి. టేబిల్ మీద నీళ్ళజగ్గు, గ్లాసులు తప్ప ఏమీ లేవు.

"సుభాష్ విషం ఎప్పుడు కలిపాడో అర్థంగావడం లేదు" అంది రమ మళ్ళీ, "నేనిక్కడ ప్లేటు సర్దేసి వెళ్ళి

పోయాను. అంకుల్ చూడకుండా కలిపాడేమో.... ఆంటీ చూసినా వూరుకుంటుంది. వినయ్ కేం తెలుసు?"

"కానీ రొట్టెలో ఎలా కలుపుతాడు? కాఫీలో కలిపి వుండాలి" అన్నాడు జాన్.

"రొట్టెకు ఆమ్లెట్ కాంబినేషన్ కాదు. రొట్టెలో ఆయనేం తీసుకున్నాడు?" లాల్ అడిగాడు.

"జామ్....జామ్...." అంది రమ.

"సీసా ఎక్కడుంది?"

ఆమె ఛటుక్కున షెల్ఫులోంచి ఒక సీసా తీసి చూపించింది.

"టట్! టట్! దాన్నెందుకు ముట్టుకున్నావు? సీసా ఎక్కడుందని అడిగాను—తీసివ్వమన్నానా? వేలిముద్రలు చెడిపోతాయి, పెట్టేసెయ్!" అరిచాడు లాల్.

ఆమె గాభరాగా దాన్ని టేబిల్ మీద పెట్టేసింది.

లాల్ దాన్ని కర్చీఫ్‌లో అందుకొని చూశాడు. పైనాపిల్ జామ్. సీసాలో సగం వుంది. మూత విప్పి చూశాడు. తీయటి వాసన వేసింది. అసహజంగా ఏమీ కన్పించలేదు.

"అంకుల్‌తో బాటు దీన్నెవరు తీసుకున్నారు?"

"అంకుల్ ఒక్కడే. పైనాపిల్ అంటే ఆయనకిష్టం. వినయ్ పంచదారతో వెన్న పూసుకున్నాడు. వాళ్ళిద్దరు ఆవకాయ వేసుకున్నారు—స్వీటు ముట్టుకోరు."

"గోధుమరొట్టెలో ఆవకాయా?" జాన్ అడిగాడు.

"అవును, తిండి విషయంలో వాళ్లు అడవిమనుషులు."

లాల్ బాటిల్ టేబిల్ మీద వుంచి అన్నాడు, "ప్లేటు కడిగేశారా?"

"అవును,"

"వెల్, విషం జామ్‌లోనో, కాఫీలోనో కల్సింది. లేక, ఈ రెంటిలోగాక ఆమ్లెట్‌లోనో, ఠోస్టులోనో, వంటగదిలో తయారుచేస్తున్నప్పుడు కలిసివుండాలి—"

"వంటగదిలోనా! అయితే వంటవ్వ—"

"ఆగండి! ఆదేమిటి?" జాన్ అన్నాడు కిటికీలోంచి బయటికి చూస్తూ.

లాల్ దగ్గరికెళ్ళి చూశాడు.

"అక్కడ .... చిక్కుడు పాదులో .... సీసాలా మెరుస్తూ—ఓహ్—అది జామ్ బాటిల్!" జాన్ కిటికీలోంచి అవతలకి గెంతి, చిక్కుడుపాదులో సీసాను ఛటుక్కున అందుకోబోయి, చెయ్యి కొరుక్కుని, కర్చిఫ్‌తో చుట్టి పట్టుకున్నాడు.

"పార్ట్‌నర్! ఇందులో జామ్‌వుంది! పైనాపిల్ జామ్!"

రమ కొయ్యబారిపోయింది.

లాల్ సూర్యకాంతికి చెయ్యి అడ్డంపెట్టి వింతగా చూశాడు.

ఇంతలో ఒక్కసారగా బయట కాలింగ్ బెల్ మ్రోగింది.

6

"అబ్బబ్బబ్బ! .... ఎంతసేపిలా బెల్‌నొక్కాలి? నేనొస్తే నిలబెట్టొద్దని నీకెన్నిసార్లు చెప్పాలి!" రేణుక లోనికి వచ్చి కసిరింది.

రమ కలవరంగా చుట్టూ చూసింది.

రేణుక వెనుక మరొక యువకుడొచ్చాడు. రేణుకకు 30 ఏళ్ళుంటాయి. సన్నగా, పొడుగ్గా, అధునాతనంగా వుంది. ఆమె చేతిలో ఏవో ప్యాకెట్లున్నాయి.

ఆమె డిటెక్టివ్‌లను ఒక్కక్షణం తేరిపార చూసి,

వెంటనే ముఖంలో చిరాకు దూరం చేసుకొని, ఒక్క సారిగా అర్చింది:

"లాల్ అండ్ జాన్! ఏమిటిలా వచ్చారు?"

జాన్ నవ్వాడు: "రండి.... మీతో మాట్లాడాలి."

"ఏం మాట్లాడాలి, మిస్టర్ జాన్?"

"చాలా మాట్లాడాలి. ఇట్స్ సాడ్ బిజినెస్, మాడమ్. మీ భర్త పోయారు."

"పోయారా....ఎక్కడికి?"

"ఆఫీసు మెట్లెక్కుతూ ఆయన క్రింద పడిపోయారు. హాస్పిటల్‌లో చేర్చేలోగా ప్రాణం విడిచారు. విష ప్రయోగం జరిగింది—విషప్రయోగం."

"విషప్రయోగమా!" రేణుక కెవ్వుమంది, "ఓహ్! ఏమిటి మీరంటున్నది? ఆయన చనిపోయారా!...." ఆమె చేతిలో ప్యాకెట్లు క్రిందపడ్డాయి. హఠాత్తుగా ముందుకు తూలిందామె.

ఆమె కళ్ళు మూతబడి, ఒక్క కుదుపుతో లాల్ భుజంమీద పడింది.

లాల్ నిలదొక్కుకొని, ఆమెను పట్టుకొని సోఫా దగ్గరికి నడిపించి కూర్చోబెట్టాడు. రమ లోనికురికి మంచినీళ్ళు తెచ్చింది. రేణుక రెండు నిమిషాల తర్వాత నీరసంగా కళ్ళు తెరిచి చూసి, నీళ్ళు తాగింది.

"కుదుటపడింది, మాడమ్.... నేను మిమ్మల్ని అప్ సెట్ చేశాను" అన్నాడు జాన్, "మీ మనసు సున్నితమైనది. ఫరవాలేదు, గట్టిగా ఊపిరిపీల్చి వదలండి! ఆల్ రైట్, ఇక కోలుకుంటారు!" తలతిప్పి ఆ యువకుడ్ని చూసి అడిగాడు, "యువర్ గుడ్ నేమ్ ప్లీజ్?"

"స్వరాజ్—స్వరాజ్ సక్సేనా!" అన్నాడతను

కంగారుగా. "ఓహ్, రేణూ! అయాం వెరీసారీ.... నాకు ఎంతో బాధగా వుంది! ఈ వాతావరణం భరించలేను! నువ్వు కోలుకున్నాక కనిపిస్తాను.... వెళ్ళిపోతాను!"

అతను రివ్వుమని తిరిగి వేగంగా వెళ్ళిపోయాడు.

జాన్ చిన్నగా నవ్వాడు. "మీకంటే సున్నితమైన వాడు! మగవాళ్ళలో ఇంత సౌకుమార్యం సహించను! అదెంత ఎబ్బెట్టుగా, వికారంగా వుంటుంది!"

"స్వరాజ్ నాకంటే చిన్నవాడు" అంది రేణుక.

"ఓహ్, మీరు కోలుకున్నారా, మాడమ్? అయితే మాట్లాడుకుందాం. మీకంటే చిన్నవాడ్ని 'ఫ్రెండ్'గా ఎన్నుకోవడం అసహజంగా వుంటుందేమో?"

"స్నేహానికి చిన్నా పెద్దా వ్యత్యాసం లేదండీ బాబూ!"

"మీదెలాంటి స్నేహం?"

"మీరేం పసిగట్టారు?"

"ఇంకా ఏమీ లేదు. పసిగట్టాలని కుతూహలం. మీది స్నేహమేనా?"

రేణుక సూటిగా చూసింది, "స్నేహమని చెప్పినా స్త్రీ పురుషులమధ్య దాన్నెవరైనా అపార్థం చేసుకుంటారనికూడా చెప్తున్నాను" అని ఒకక్షణం ఆగి "ఆయన చనిపోయారుకదూ? మీ చేతుల్లో ఆ బాటిల్సు ఏమిటి? పైనాపిల్ మీ కిష్టమా? పట్టుకెళ్ళండి మిస్టర్ జాన్. అభ్యంతరం లేదు!"

"జాన్ చిన్నగా నవ్వుతూ కర్చీఫ్‌లో వున్న బాటిల్‌ని టీపాయ్‌మీద పెట్టాడు.

"ముట్టుకోకండి! ఈ 'J' మార్కు వున్న బాటిల్ చూశారా—దీన్ని నేను చిక్కుడుపాదులో కనిపెట్టాను.

ఇందులో విషం కలిపి మీవారికి పెట్టారు. ఆయన టిఫిన్ పూర్తయాక ఈ బాటిల్‌ని బయటికి విసిరి, ఈ 'L' మార్కు వున్న కొత్త బాటిల్‌లో ఇదేమేరకు జామ్ తొలిగించి, 'J' స్థానంలో పెట్టారు."

"ఎవరు? ఎవరు పెట్టారు?" రేణుక అడిగింది ఘటుక్కున.

"వూహించండి! రాత్రి జరిగిన సంఘటన ప్రకారం మీ తమ్ముడికి గట్టి మోటివ్ వుంది. ఏమంటారు?"

"మిస్టర్ జాన్!" రేణుక అంది, లేచి నిలబడి. "నేను రాకముందు మీరిక్కడ చాలా విషయాలు తెలుసుకొని వుంటారు—రమ చెప్పింది. అవన్నీ మళ్ళీ ప్రస్తావించ దలచలేదు. క్లుప్తంగా చెప్తాను. నిన్న రాత్రి మావారు సుభాష్‌ని కోప్పడ్డారు, లేనిపోని నిందలు ఆ అమాయకుడి మీద వేశారు—నిజమే. వాడిలో పౌరుషము లేదనను. కానీ, బావగారిమీద ఆ కసితో వాడాపనికి ఒడిగట్టడని నేను చెప్తున్నాను. మీరు పూర్తిగా నమ్మి ఇక వెళ్ళి పొండి!"

"అయితే ఆ పని ఎవరు చేశారంటారు?" అన్నాడు జాన్, ఆమెను ఆపే ప్రయత్నం చేస్తూ. ఆమె తలెగరేసి వెళ్ళబోయింది. కానీ కాలింగ్ బెల్ మ్రోగడంతో ఆగి పోయింది.

రమ పరిగెత్తివెళ్ళి తలుపు తోసింది.

పోస్టల్ మెసెంజర్ తొంగిచూసి, "టెలిగ్రాం—" అన్నాడు.

రమ వెనక్కి తొలగి నిలబడిపోయింది. అతను లోనికొచ్చి రేణుక దగ్గరికెళ్ళాడు. ఆమె ఆత్రుతగా సంతకం పెట్టి టెలిగ్రాం అందుకుంది. పేస్టింగ్ చింపి, మడత

విప్పి చదివింది. ఆమె ముఖం రంగులు మారాయి.

"ఉమేష్!" అందామె ఒక్కసారిగా.

"అతనెవరు?" జాన్ అడిగాడు.

"ఉమేష్ మావారి మొదటి కుమారుడు. నా పెళ్ళయాక నామీద అలిగి వెళ్ళిపోయాడు....వయసు అలాటిది. అప్పుడతనికి పంధొమ్మిదేళ్ళు. రెండేళ్ళు గడిచాయి....ఇంటి ముఖం చూళ్ళేదు! తండ్రితో అతనికెప్పుడూ పడేదికాదు! అతని పోరు భరించలేక ఆయనే వెళ్ళగొట్టారు!"

"ఇప్పుడెక్కడున్నాడు?"

"ఈ టెలిగ్రాం బెంగుళూరు నుంచి ఇచ్చాడు. సాయంత్రం వస్తున్నాడట."

జాన్ టెలిగ్రాం అందుకొని పరిశీలించాడు.

"ఎందుకొస్తున్నాడు? తండ్రి రమ్మన్నాడా?"

"ఏమో, నాకు తెలియదు! అతను వెళ్ళడానికి కారకురాల్ని నేనే! నన్ను కష్టపెట్టడం ఇష్టంలేక అతన్ని వెళ్ళగొట్టారు."

"సవతితల్లిని పిల్లలు—అందునా ఎదిగిన పిల్లలు—సహించరు!"

రేణుక ముఖం ఎర్రబడింది. విసురుగా కదిలి వెళ్ళిపోయింది.

"ఆగండి, మాడమ్" లాల్ అన్నాడు చివరికి, "మేం పూర్తిగా మీ తమ్ముడి మోటివ్ మీదే ఆధారపడదలచలేదు. మరికొందరి మోటివ్స్ పరిశీలించాలి—"

"పరిశీలించండి! సుధాకర్ వున్నాడు—అతను మా కుటుంబం మీద కత్తుబూనాడు!" రేణుక అంది అడ్డుతగిలి.

లాల్ నవ్వాడు, "ఈ విషయంలో అతనికి మొదటి గుర్తింపు ఇచ్చాం. అతని విషయం వదలండి! మీ గురించి

చెప్పండి: మీకు మోటివ్ వుందా"

ఆమె అసహనంగా అంది: "మావారి లాయర్‌ని కలవండి. ఆయన వీలునామా వ్రాశారు. అందులో మీకేదేనా మోటివ్ దొరికిందంటే అది నా దురదృష్టం. కానీ, నేరం రుజువు చెయ్యడానికి మోటివ్ ఒకటే ఆధారం కాదని మరువకండి!"

లాల్ నవ్వాడు, "మీ లాయరెవరు?"

"మిస్టర్ సంఘర్షన్‌రెడ్డి" అనేసి నిరాటంకంగా కదిలి వెళ్ళిపోయింది రేణుక.

7

లాయర్ సంఘర్షన్‌రెడ్డి వి. కాంత్ మరణంపట్ల విచారం వెలిబుచ్చి చెంపలు రుద్దుకున్నాడు. అతని చావుకి బాధ్యులైనవారిని చట్టం దృష్టికి తేవడానికి డిటెక్టివ్‌లతో సహకరించేందుకు అతను యెంత మాత్రమూ సందేహించకుండా వీలునామాలో అంశాల్ని వెల్లడి చేశాడు.

ఆ వీలునామా రెండేళ్ళ క్రితం—అంటే వి. కాంత్ రెండో పెళ్ళి చేసుకొన్న రెండు నెలల తర్వాత రిజిస్టర్ చేయించబడింది.

అతను యావదాస్తిని నాలుగు భాగాలుగా విభజించాడు. మొదటి మూడుభాగాలూ అతని రెండవభార్యకూ, ఇద్దరు కుమారులకు సమానంగా పంచాడు. మిగిలిన పదో వంతు విలువచేసే భాగం పదిహేనేళ్ళుగా నమ్మకంగా పని చేస్తున్న వంటవ్వకు వ్రాశాడు.

అందులో క్లాజులూ, సబ్‌క్లాజులూ చాలావున్నాయి. వాటిలో ముఖ్యమైనవి: తన మరణానంతరం తన భార్య ఒక సంవత్సర కాలం వైధవ్యం పాటించిన పక్షంలోనే

ఆమెకు చెందవల్సిన ఆ స్తికి హక్కుదారవుతుంది. ఈలోపు మరో పెళ్ళి చేసుకొన్నా, లేదా శారీరక సంబంధాలేర్పరచుకొన్నా అందుకు అనర్హురాలవుతుంది.

ఆమె అర్హతను నిర్ణయించడానికి కొన్ని రహస్యమైన ఏర్పాట్లు జరిగాయి. అవి రహస్యంగానే వుంటాయి.

మొదటి కుమారుడు కంపెనీ వ్యవహారాలకు పూర్తి అధిపతి కావడమేగాక తమ్ముడికి గార్డియన్‌గా వ్యవహరిస్తాడు.

అయితే ఉమేష్ యిల్లు విడిచి వెళ్ళాక విల్లును సవరించలేదు. అతనిమీద తన కెలాంటి ద్వేషం లేదనీ, అతనలా వెళ్ళడం అతని మంచికేనని, లోకజ్ఞానం, బాధ్యతలు గ్రహించి ప్రయోజకుడవుతాడనీ, అప్పుడు తప్పక తిరిగివస్తాడనీ వి. శాంత్ చెప్పినట్లు లాయర్ వివరించాడు.

"సరే__అతను చనిపోయాడు. ఇప్పుడున్న ఆ స్తుల విలువెంత?"

"స్థిరచరాస్తులు కలిపి 20 లక్షలు."

"థాంక్యూ వెరీమచ్!"

లాయర్‌తో ఇంటర్వ్యూ ముగిశాక డిటెక్టివ్‌లు ఆఫీసుకు చేరుకున్నారు.

"వెల్, పార్టనర్. ఇప్పుడు మోటివ్ తోస్తోందా?" అడిగాడు జాన్.

"సుభాష్ మోటివ్ అంత బలంగాలేదు, జాన్. అతను వివేకం లేనివాడనుకోను. ఘర్షణలో బావమీద ఎంత కసి పుట్టినా తెల్లారి విషంపెట్టి చంపేస్తే సులభంగా అనుమానితుడవుతాడు. అతనీ మాత్రం ఆలోచించలేని మూర్ఖుడనుకోను."

"సరే, రేణుక గురించి చెప్పు."

"ఆమెకు మోటివ్ వుంది. కానీ, రంగంలో దిగడానికిది అనువైన అవకాశమేనా? దాని ఫలితం తమ్ముడనుభవిస్తాడని ఆమెకు తెలియదా? ఆమె తమ్ముడ్ని ఇరికించాలనుకునేంత కారణం కన్పించడంలేదు. వెల్, రమ చెప్పినట్లు ఆమె భర్త చావుకోసం నిరీక్షిస్తోంది. ఎప్పుడో వచ్చే ఆ చావు కోసం, ఆ తర్వాత సంవత్సరంపాటు త్యాగం చేయవల్సిన స్వేచ్ఛకోసం, ఆమె తొందరపడాలనుకుంటే యింత మూర్ఖంగా ప్రవర్తించదు! ఆమె తెలివిగలది, జాన్. చాలా తెలివిగలది!"

"అయితే మోటివ్‌తోబాటు అవకాశం ఎవరికుంది?" జాన్ కసిరాడు.

"సుధాకర్—అతని గురించి ఆలోచించావా?"

"అతనో సైకో! ఏమాలోచించాలి?"

"అక్కడే పొరబడ్డాం! అతను మనల్నెలా ఫూల్స్ చేస్తున్నాడో గమనించావా? ఆలోచించు! అతను వి. కాంత్ మీద కక్ష బూనాడు. అతనికి గుండెజబ్బు వుందని తెలుసు. అయితే అతని అంతు యెలా చూస్తాడు? గుండెజబ్బు వున్న అతన్ని మెట్లమీంచి దొర్లించా? లేక టిఫిన్‌లో విషం కలిపా? మైడియర్ పార్ట్‌నర్, అతను మొదటిది చెయ్యడు! ఎందుకో తెలుసా? పట్టుబడే అవకాశం వుంది! అందుకే విషం యిచ్చి పరిణామాల కోసం ఎదురుచూడసాగాడు. ఇంతలో నువ్వు ఫోన్ చేసి వి. కాంత్ మెట్లమీంచి దొర్లాడన్నావు. విషప్రయోగంవల్ల చనిపోయాడన్నావు. అందుకతనేమన్నాడు? కాదు, అతనికి గుండెజబ్బు వుంది—నేనే మెట్లమీంచి నెట్టేశాను, చచ్చాడన్నాడు!

అర్థమవుతోందా? అప్పుడతని మాట లెవరు నమ్ముతారు? పిచ్చివాడనుకొంటారు! కక్షబూనిన వ్యక్తి మరొకరి చేతిలో దుర్గతిపాలవడంతో ఆ ఘనకార్యం తనదేనని చెప్పుకొని తృప్తిచెందుతున్నా డనుకుంటారు! కానీ, వాస్తవానికి అతనే ఈ హత్యను ఒక పద్ధతిలో చేసి, దాన్ని తప్పించుకోవడానికి మరో పద్ధతిని బుకాయిస్తున్నట్లు ఎవరు తెలుసుకుంటారు జాన్!"

"గాడ్! దిసీజ్ టూ మచ్! యిప్పుడేం చెయ్యాలి?"

"ఉదయంనుంచీ అతని కదలికల్ని ట్రేస్ చెయ్యాలి. అతన్ని షాడో చెయ్యాలి. అతను శపథం చేశాడు. దాన్ని తప్పకుండా నెరవేర్చుకొంటాడు! అతన్ని జాగ్రత్తగా కనిపెట్టి రెడ్‌హేండెడ్‌గా పట్టుకోవాలి!"

"వెల్, లాల్. అతను కౌబాయ్ అడ్వెంచర్స్‌కి పూనుకొంటే అదెంత కష్టసాధ్యమో నేను తెలియజేస్తాను!" జాన్ లేచి బయటికి నడిచాడు.

అదే సమయంలో పోలీస్ కెమిస్టు నుంచి ఫోన్ వచ్చింది.

"హలో, మిష్టర్ లాల్. మీరిచ్చిన రెండు బాటిల్స్‌లో 'J' మార్క్ చేసినదాంట్లో విషం కనుక్కున్నాను! పచ్చగన్నేరు విత్తనాల పొడి."

లాల్ కళ్ళు విశాలమయ్యాయి. "ఆర్యూ ష్యూర్?"

"ష్యూర్. 'L' మార్క్ బాటిల్ స్వచ్ఛంగా వుంది."

"వేలిముద్రలకి పంపారా?"

"పంపాను. 'J' మీద లేవు; 'L' మీద అయిదు వేళ్ళముద్రలున్నాయి."

"థాంక్స్!" లాల్ రిసీవర్ పెట్టేసి అసహనంగా

పచార్లు చేశాడు. ఇంతలో ఇన్స్పెక్టర్. కృష్ణన్ రివ్యూమని దూసుకొచ్చి కూర్చున్నాడు. లాల్ అతన్ని ఎగాదిగా చూశాడు.

"యస్? యేం జరిగింది? యేం తెలుసుకొన్నారు?"

కృష్ణన్ పెదవులు చప్పరించాడు. "ఏమీ లేదు. చావు విషంవల్ల సంభవించింది. ఏ విషమన్నది ఎనాలిసస్లో తేలుతుంది. ఇంకేం చెప్పాలి?"

"విషం పచ్చగన్నేరు విత్తనాలపొడి, ఇన్స్పెక్టర్. విషం కలిపిన పదార్థం మీ కెమిస్టుకి పంపి తెలుసు కొన్నాను."

"ఓహో గన్నేరు విత్తనాలవల్ల ఛస్తారా?"

"మోతాదు మించితే తప్పదు! 8 నుండి 10 గింజల వరకు ప్రమాదకరం. తీసుకొన్న ఒకటి, రెండు గంట ల్లోగా చావు సంభవిస్తుంది."

"అయితే ఆ విత్తనాలెక్కడ నుంచి వచ్చాయి?"

"హతుడి యింట్లో గన్నేరు మొక్క లున్నాయో లేవో తెలియదు. అతని సెక్రటరీ యింట్లో కూడా చూడాలి. ఆమె భర్త అనుమానస్పదంగా వున్నాడు. జాన్ అతనిమీద నిఘా వున్నాడు. ఫోన్ చేస్తే మొక్కల గురించి చెప్తాను."

కృష్ణన్ లేచి బయటికి నడిచాడు.

అరగంట తర్వాత జాన్ ఫోను చేశాడు. సుధాకర్ ఉదయం 8-9 మధ్య యింట్లో లేడని చెప్పాడు. ఎక్కడి కెళ్ళాడో తెలియదు. రాత్రంతా యిల్లు కదల్లేదు. సరిగ్గా పది గంటలకి ఆఫీసులో ఉన్నాడు. యింత వరకూ కద ల్లేదు.

"ఓ. కే. జాన్! జామ్లో విషం పచ్చ గన్నేరు

గింజల పొడి. వి. కాంత్ యింట్లో ఎక్కడైనా గన్నేరు చెట్లు చూశావా? సరే సుధాకర్ యింట్లో చూడు........ సాయంత్రం ఉమేష్ వస్తున్నాడు. నేనతన్ని కలుసుకోవడాని కెళ్తున్నాను."

లాల్ ఫోను పెట్టేసి లేచాడు.

8

రమ తలుపుతీసి మళ్ళీ ఆశ్చర్యంగా చూసింది.

"ఉష్! మాట్లాడకు!" లాల్ వారించాడు, "రేణుక ఎక్కడుంది?"

రమ బెదురుతూ చూసింది, "పైన గదిలో చదువుకుంటోంది."

"ఇంట్లో ఇంకెవరున్నారు?"

"ఎవరూ లేరు. సుభాష్ వినయ్ కోసం స్కూలుకెళ్ళాడు."

"నువ్విక్కడే ఉండు. నేను రేణుకను చూస్తాను—"

"వద్దు! మిమ్మల్నిలా పంపినందుకామె తిడుతుంది!"

"తిట్టే అర్హత యెవరికీ ఎల్లప్పుడూ ఉండదు!"

"అంటే?"

ఇంతలో పైన యెక్కడో ఫోను మ్రోగిన శబ్దమైంది.

"అంటే—నీ కర్థంగాదు! నన్నడక్కు—టైంలేదు!" లాల్ చకచకా కదిలి మెట్లెక్కసాగాడు. బూట్ల చప్పుడు కాకుండా జాగ్రత్తగా పైన గదుల్ని చూస్తూ, ఒక గది ముందాగిపోయాడు.

ఆ గదిలో రేణుక బెడ్ మీద బోర్లాపడుకొని ఉంది. తల బాతులా యెత్తి వుంచి ఫోన్లో మాట్లాడుతోంది....లాల్ ద్వారం ప్రక్కన నక్కి చెవులు రిక్కించాడు.

"....నాన్సెన్స్, స్వరాజ్! ఎందుకలా భయపడ్డావ్! నువ్వు పిరికివాడివై పోతున్నావు! ఏమీ కాదంటున్నాను. అర్థమైందా? ఏమీ జరుగదు! నిర్భయంగా ఉండు! అవును....అంతా సవ్యంగాఉంది. డిటెక్టివ్ లిప్పుడిక్కడ లేరు!....ఏమిటీ! ఓహ్, యూ సిల్లీ! నువ్వెంత భయస్థుడివి, డార్లింగ్! ఆ ఉత్తరా లెవరికీ దొరకవు! అండర్‌స్టాండ్! వాటి గురించి బెంగపడకు!....నా టేబిల్లో రహస్య అర ఉంది. అందులో దాచాను....పోలీసులు కనుక్కోలేరు. అయినా వాళ్ళెందుకు గాలిస్తారు?

"ఓహ్....నీకు మతిపోయింది! ప్రేమలేఖల్ని యెవరైనా తగులబెడ్తారా డియర్! పిచ్చి భయాలతో బుర్ర పాడుచేసుకోకు!....అలాగే .... అలాగే .... అలాగే.... ఏమిటీ! సాయంత్రం వస్తావా? యూ స్టుపిడ్! రాకు! ఈ ఛాయలకి రాకూడదు—ఇక మనం చాలా జాగ్రత్త పడాలి....ఇదివరకటిలా కలుసుకొనే వీల్లేదు! ఆ విషయాలన్నీ మనం ముందే చర్చించుకున్నాం కదా?....ఓ.కే, పెట్టేస్తున్నాను."

ఆమె ఫోను పెట్టేసి నిట్టూర్పు విడిచింది. కొన్ని క్షణాలు కళ్ళు మూసుకొని నిశ్చలంగా వుండి, తర్వాత నవల అందుకోబోయింది—కాని ద్వారం దగ్గర లాల్‌ని చూసి ఛెంగున ఎగిరి నిలబడింది.

"మిస్టర్ లాల్!" ఆమె ముఖం కోపంతో యెర్రబడింది. చరచర దగ్గరి కొచ్చి ఎగాదిగా చూసింది, "డామిట్! ఐ డోంట్ లైకిట్! మీరు నా గదిలో తొంగి చూడ్డం—రహస్యంగా నా మాటలు వినడం—మిమ్మల్ని అసలు లోని కెవరు రానిచ్చారు?"

"నేనే వచ్చాను. ఆఫ్‌కోర్స్, రమ అభ్యంతరం చెప్పింది—" అన్నాడు లాల్ ప్రశాంతంగా, "మీ ఫోన్ సంభాషణలో నాకేం ఆసక్తి లేదు—అది నేను వూహించిందే. ఇక మీ గదిలో చూడ్డమంటారా—దొంగచాటుగా అందాల్ని గమనించే అలవాటు నాకు లేదు!.... నేను విల్లు గురించి తెలుసుకున్నాను. మీకు మోటివ్ ఉంది. అంతేకాదు, దానితోబాటు అవకాశం కూడా ఉంది."

ఆమె చురచుర చూసింది. "ఏమిటి మీ రనేది?—నా న్సెన్సెక్కడో!"

"యూ సీ మాడమ్. ఈ హత్యలో ఇంతవరకూ మేం యిరువురినే అనుమానించాం. మీ తమ్ముడు—సుధాకర్. మిమ్మల్ని అనుమానించడానికి మనస్కరించలేదు. మీ ప్రయోజనాలకోసం స్వంత తమ్ముడ్ని ఇరకాటంలో పెట్టే పరిస్థితిని ఎన్నుకోరనుకున్నాం—"

"మరి యిప్పుడేమనుకుంటున్నారు?"

"మీలో వొకరు ఆ పని చేశారు!" అన్నాడు లాల్ నిశ్చయంగా, "మీరు లేదా, మీ తమ్ముడు. మీ తమ్ముడికంటే అవకాశం మీకే చక్కగా ఉంది.

"మీరేనాడూ భర్తను ప్రేమించలేదు. అతని డబ్బుని ప్రేమించారు. అతని కళ్ళముందే మరొకరితో తిరుగుతున్నారు. ఆఫ్‌కోర్స్, మీ భర్త అభ్యంతరం పెట్టి ఉండవచ్చు. విల్లు గురించి హెచ్చరించి ఉండవచ్చు—మీ ప్రవర్తన మారని పక్షంలో ఆస్తికి మీ హక్కుల్ని మరింత కఠినతరం చేయగలనని. ఆ విల్లు గురించి మీకు తెలుసు. అక్కడికే అది మీ స్వేచ్ఛకు చాలా భంగం కల్గించింది, ఇప్పుడతను బెదిరిస్తున్నాడు....అయినా మీ

ప్రవర్తన మారలేదు. మీ చపల తత్వం అలాంటిది.

"అందుకే అతను విల్లును తిరిగి సవరించే లోపున ఏదో వొకటి చెయ్యాలనుకున్నారు—దానివల్ల మీరు త్యాగం చేయవల్సిన స్వేచ్ఛాకాలం కూడా కలిసివస్తుంది....

"వెల్, ఆ అవకాశం నిన్న లభించింది. సుధాకర్ శపథం చేశాడు. అది వొట్టి శపథమేనని మీకు తెలుసు. అతను ఉద్రిక్తస్థితిలో అలా బెదిరించాడుగానీ, వాస్తవానికి కతనికా ఉద్దేశం లేదు. పైగా ఆతను పోలీసుల ముందు శపథం చేశాడు. దీన్ని మీరు తెరగా ఉపయోగించి మీ ప్రయోజనాలు సాధించుకొని, అతన్ని బలిపశువుని చెయ్యాలనుకున్నారు—"

"నేనలా అనుకోలేదు!"

"అలా అనుకొని మీరు స్వరాజ్‌తో చర్చించారు. అతను వెంటనే అంగీకరించాడు....నిన్న సాయంత్రం అతను గన్నేరు గింజల పొడి తెచ్చి ఇచ్చాడు. ఉదయం మీరు జామ్‌లో కలిపి, మీ భర్త వెళ్ళాక సీసాలు మార్చేసారు. ఆ స్వాతంత్ర్యం మీకుంది."

ఆమె విస్తుపోయి చూసింది.

లాల్ విసురుగా కదిలి బయటికొచ్చేశాడు.

9

అప్పుడే సుభాష్ వినయ్‌తో లోనికొస్తూ కన్పించాడు. లాల్‌ని చూసి అతను తల వంచుకొని గబగబ పైకి పోయాడు.

హాల్లో ఫోను మ్రోగుతోంది. లాల్ వెళ్ళి రిసీవర్ ఎత్తాడు.

"హాలో, లాల్!"

"యస్! జాన్!"

"సుధాకర్ యింట్లో గన్నేరు చెట్టు వుంది—పచ్చ గన్నేరు."

లాల్ కళ్ళు విశాలమయ్యాయి. "అతని గురించి ఏం తెలుసుకున్నావు?"

"అతను నిన్న సాయంత్రంనుంచీ మర్నాడు ఉదయం ఎనిమిది గంటలవరకూ యిల్లు కదల్లేదు. ఎనిమిది నుండి తొమ్మిదిగంటలవరకు—"

"ఎక్కడ ఉన్నాడు?"

"బార్బర్ షాపులో—అతని క్రాఫు చూసి అనుమానంతో ఆరాతీశాను. రూఢి అయింది. తొమ్మిది గంటలకి క్షవరం చేయించుకొని యింటికి వచ్చాడు. పది గంటలకి ఆఫీసు కెళ్ళాడు—ఇంతవరకూ కదల్లేదు."

లాల్ టైము చూశాడు. సరిగ్గా 4-49.

"వెల్, అతన్ని కనిపెడతావా?"

"ఆఫీసు వదిలాక యెక్కడికి కెళ్తాడో చూస్తాను. ఉమేష్ వచ్చాడా?"

"ఇంకా లేదు—" అని లాల్ రేణుక యాంగిల్ వివరించి చెప్పాడు.

"ఓహ్! యూ ఆర్ డామ్ కరెక్టు! అయితే యేం చేస్తున్నావు?" అన్నాడు జాన్.

"మెటీరియల్ ఎవిడెన్స్ గురించీ ఆలోచిస్తున్నాను. ....ఇంకేవైనా క్లూస్ దొరుకుతాయేమో చూస్తున్నాను. ఇది పూర్తిగా లాజికల్ వ్యవహారం."

"అవును...."

"సుధాకర్ కోసం యింత సమయం వెచ్చిస్తున్నాం కాబట్టి అతని ఎలిబీని క్షుణ్ణంగా చెక్ చెయ్యాలి. బార్బర్ షాపులో యెంత సమయం గడిపాడో, ఇంటికి

రాకపోకలెంత సమయం తీసుకున్నాయో తెలుసుకోవాలి.”

“అలాగే....ఎలిబీ కోసం గ్రాఫు చేయించుకున్నాడంటావా?”

“అతను మనల్ని యే ఉద్దేశంతో ఫూల్సు అన్నాడో తెలుసుకోవాలి.”

లాల్ రిసీవర్ పెట్టేసి సిగరెట్ వెల్గించాడు.

రమ హాల్లోకి వచ్చి లాల్‌ని కాఫీకి రమ్మంది. లాల్ ఆమెతో డ్రాయింగ్ రూంలోకి అనుసరించాడు. అక్కడ అప్పటికే రేణుక వుంది. ఆమె ఎదురుగా వినయ్ వున్నాడు. సుభాష్ ఇంకా రాలేదు. రమ అతన్ని పిలువడానికెళ్ళింది.

లాల్, రేణుక ముఖంలోకి తదేకంగా చూశాడు.

ఆమె ముఖంలో ఎలాంటి భావాలూ లేవు. టీపాయ్ మీద కప్పుల్ని పరధ్యానంగా చూస్తూ కూర్చుంది. సుభాష్ వచ్చాక అతన్నిచూసి తేరుకొంది. ఇద్దరూ ఒకరొన్నకరు చాటుగా చూసుకొని ముఖాలు తిప్పుకున్నారు. లాల్ కప్పు అందుకొని త్రాగడం ప్రారంభించాడు.

“మీరిద్దరూ ఎంత కృతజ్ఞతగలవారో తెలుస్తోంది! మార్చ్యురీలో మీ భర్త దిక్కులేకుండా పడివుంటే, మీరిక్కడ నవలలు చదువుతూ, ఫోన్‌లో సూచనలిస్తూ చాలా చక్కగా కాలక్షేపం చేస్తున్నారు” అన్నాడు లాల్ కప్పు క్రిందపెడుతూ.

రేణుక బాధగా నవ్వింది, “మీరర్థం జేసుకోలేరు, లాల్. ఈ రోజు ఉమేష్ వస్తున్నాడు. ఎన్నో ఆశలు పెట్టుకొని, ఎంతో ఉత్సాహంతో, చాలారోజుల తర్వాత వస్తున్నాడు....అవునా? ఆ క్షణాన అతనికి తండ్రి మృత

దేహంతో స్వాగతం చెప్పడం ఎంత ఘోరంగా వుంటుంది! ఆలోచించండి! నేనింకా అతన్ని గాయపర్చలేను! అతని బాధల్ని సహించలేను!"

"అవును, మీది చాలా సున్నిత మనస్తత్వం."

"నేను స్వప్నజీవిని. పుస్తకాలే నా ప్రపంచం. వాస్తవ జీవితంలోని చేదునిజాల్ని అంగీకరించలేను— ఎస్కేపిస్ట్‌ని. మనల్ని రాచి రంపాన పెట్టే కఠోర సమస్యల నుంచి దూరంగా పారిపోయి—తీయటి కలల్లో—అదో లోకంలో విహరించడం ఎంత హాయిగా వుంటుంది! మనసు ఎంత ఉల్లాసం పొందుతుంది!"

"అది ఉల్లాసం కాదు, మానసిక రుగ్మత. ఉల్లాసం వాస్తవానుభవాల్లోనే వుంది."

ఆమె నవ్వింది, "చేతినిండా పనులున్న వాళ్ళు చెప్పే మాటలివే. నాకేమీ పనిలేదు, కలలుగనడం తప్ప. కలలుగనడం తప్పుకాదు, వాటిని నిజం చేసుకోనే శక్తి లేకపోతే అది బలహీనత కింద మారుతుంది. నాకా శక్తి వుంది. నేను సాధిస్తాను. నా జీవితాశల్ని నెరవేర్చుకుంటాను. ఏమంటారు?"

"మీరు చాలా నిష్కపటంగా మాట్లాడతారు!"

"నాకు తెలుసు, మీరు నన్ను గాయపర్చాలని చూస్తున్నారు. ఉదయంనుంచీ చూస్తున్నాను, మీ గేలి చేసే ధోరణి మారడంలేదు!"

లాల్ నవ్వాడు, "స్వప్నజీవుల స్వభావం మీరు స్వానుభవంతో చెప్పారుగా — వాస్తవాన్నంగీకరించలేరని! కాఫీ తాగండి, చల్లారుతోంది."

ఆమె అదోలా నవ్వింది: ఆ నవ్వులో తన్ను అర్థంజేసుకొనే మేధావి లేడన్న భావం వుంది. ఆమె వంగి కప్పు

అందుకోబోయింది—అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది.

"ఎవరు?" అంది రేణుక.

"ఉమేష్ కావచ్చు" అన్నాడు లాల్.

"రమా!" రేణుక పిల్చింది, "రమా! వెళ్ళి తలుపు తీయ్!"

లాల్ టైము చూశాడు: సరిగ్గా 5.00 గంటలైంది. ఇంకా తలుపుతీసిన చప్పుడు లేదు. మరోసారి బెల్ మ్రోగింది.

రేణుక మళ్ళీ రమను పిల్చింది: సమాధానం లేదు.

"ఓహ్, ఎక్కడికెళ్ళింది సుభాష్, నువ్వెళ్ళి తీయ్!"

సుభాష్ కాఫీ పూర్తిచేసి వెళ్ళాడు. కాస్సేపయ్యాక తలుపు తీసిన శబ్దమూ, మాటలూ విన్పించాయి. మరి కాసేపటికి డ్రాయింగ్ రూం ద్వారంలో ఒక యువకుడు ప్రత్యక్షమయ్యాడు.

అతను సన్నగా, పొడుగ్గా వున్నాడు. తెల్లటి వర్ణం. కోల మొఖం. చెవులమీదకి పడుతున్న జుత్తు. అతని నల్లటి కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

అతను సూట్ కేసు క్రింద పడేసి రెండు చేతులూ పైకెత్తాడు:

"హాయ్ పిన్నీ!"

"ఉమేష్!...." రేణుక గొంతు వొణికింది.

అతను ఒక్క మూకులో ఆమె దగ్గరికొచ్చాడు.

"ఓహ్, పిన్నీ! నన్ను క్షమించు!-నన్ను క్షమించవా?"

"నువ్వింక బాధపడకు, ఉమేష్! అంతా ఇక మర్చిపో! నువ్వు తిరిగి వచ్చినందుకు సంతోషంగా వుంది!"

"అప్పుడు నిన్నెంత బాధపెట్టాను, పిన్నీ!"

"అప్పుడు నువ్వు చిన్న పిల్లాడివి, బాబూ! ఇప్పుడు

పెద్దవాడివి, అన్నీ అర్థం జేసుకోగలవు!"

"నువ్వెంత మంచిదానివి పిన్నీ! నన్ను అసహ్యించుకొంటా వనుకొన్నాను!"

"లేదు, ఉమేష్! నిన్నింకా గాయపర్చను. బాధ పెట్టను!"

కొన్ని క్షణాలయ్యాక ఉమేష్ షర్టు అంచుతో కళ్ళు తుడుచుకొని అందర్నీ చూశాడు. లాల్ ప్రక్కన తమ్ముడ్ని చూసి ముందుకు దూకాడు.

"వినూ్నా! ఎంత ఎదిగిపోయావురా! ఎలా వున్నావ్?"

వినయ్ లేచి నిలబడి రెండు చేతులూ జాపాడు. ఉమేష్ అతన్నెత్తుకొని ముద్దాడాడు.

"నన్ను మర్చిపోయావా?....నువ్వు జ్ఞాపకంరాని క్షణం లేదు! నిన్నుకూడా ఎత్తుకొచ్చేయాల్సిందనుకొనే వాడ్ని!"

రేణుక ఫకాలుమని నవ్వింది. ఉమేష్ తమ్ముడ్ని దింపి ఆమె పక్కన కూలబడ్డాడు.

"ఓహ్—కాఫీ తెప్పిస్తాను—" అంది రేణుక.

"డాడీ ఎలా వున్నాడు పిన్నీ?"

రేణుక ఉలికిపడింది. తటపటాయిస్తూ లాల్ని చూసింది. లాల్ తల త్రిప్పుకున్నాడు.

"నీ డాడీ....ఆయన గురించి భయపడ్తున్నావా?" జాగ్రత్తగా అడిగింది రేణుక.

"భయంకాదు—ఆరోగ్యం ఎలా వుంది?"

"దానికేం? బాగానే వుంది!"

"లేదు, గుండె ట్రబుల్ ఇస్తోందని లెటర్ వ్రాశాడు పిన్నీ!"

రేణుక ఆశ్చర్యంగా చూసింది, "లెటర్ వ్రాశారా? ఎప్పుడు?"

"నెలరోజులైంది....అందుకే నేనిక్కడికొచ్చాను. జరిగింది మర్చిపోయి యింటికి రమ్మన్నాడు. ఆయన జబ్బు తీవ్రమయేట్టుందిట—ఇహ బాధ్యతలు నన్ను తీసుకోమని వ్రాశాడు. ఆయన ఉత్తరం చదివాక ఆతృత ఆపుకోలేకపోయాను పిన్నీ! అలాగే వస్తానని వ్రాశాను.... అక్కడ ఉద్యోగం మధ్యలో వదల్లేను. జీతం తీసుకొని వస్తానని వ్రాశాను....నిన్న మూడో తారీఖున టెలిగ్రాం యిచ్చాను. అందలేదా?"

"అందింది—" రేణుక మళ్ళీ రమను పిల్చి కాఫీ తెమ్మంది. "కానీ నువ్వక్కడ వున్నట్టు ఆయన కెలా తెలుసు?"

"ఇక్కడ నా ఫ్రెండ్‌కో ఉత్తరం వ్రాశాను. వాడు వెళ్ళి డాడీకి అడ్రసు ఇచ్చి వుంటాడు...."

"నువ్వక్కడేం చేసేవాడివి ఉమేష్?"

"చాలా వూళ్ళు తిరిగాను, పిన్నీ. ఎక్కడా సరైన ఉద్యోగం లేదు.... వెళ్ళిన మొదట్లో మూడు నెలలు తిండి లేదు. నిద్రలేదు. హోటల్‌లో పని చేశాను. కుదరలేదు. మిల్లులో బస్తాలు మోసాను. గ్యారేజిలో కార్లు బాగు చేశాను. బట్టలషాపులోనూ పని చేశాను. కానీ—వాళ్ళు చెయ్యాని దొంగతనం మోపి తరిమేశారు—"

"ఉమేష్! చెప్పకు! ఇక చెప్పకు!"

రేణుక భారంగా నిట్టూర్చింది.

"ఈ రమ యెక్కడ చచ్చింది? ఎన్నిసార్లు పిల్చినా పలకదేం?"

"దాని సంగతి నేను చూస్తాను!" సుభాష్ లేచి వెళ్ళాడు.

"నా కాఫీ చల్లారింది—నా కూడా తెమ్మను!"

అంది రేణుక.

ఆ తర్వాత ఉలికిపడి ఉమేష్‌ని లాల్‌కు పరిచయం చేసింది.

"పోలీసులూ, డిటెక్టివ్‌లూ నాకు నచ్చరు! ఈ రెండేళ్ళూ అడుగడుగునా నేను వాళ్ళతో చాలా విసిగి పోయాను!" అన్నాడు ఉమేష్.

లాల్ నవ్వుతూ లేచాడు, "నువ్వు చాలా దూరం ప్రయాణించి వచ్చావు. నిన్ను విసిగించను. ఇప్పటికే యిక్కడ చాలామందిని విసిగించాను. డోంట్ బాదర్. రిలాక్స్ మైబాయ్!"

10

"రమ ఎక్కడికెళ్ళిందో తెలియడంలేదు!" అన్నాడు సుభాష్.

"ఎక్కడికెళ్ళింది?" లాల్ అడిగాడు.

"పదినిమిషాల క్రితంవరకూ కిచెన్‌లోనే వుందని అవ్వ చెప్పింది. యిల్లంతా గాలించాను....యెక్కడా లేదు!"

"బయటికెళ్ళిందా?"

"బయటికెళ్తే చెప్పకుండా వెళ్ళదు!"

"అయితే ఎక్కడికెళ్ళింది?"

"డామిట్! నాకెందుకు, బాస్?" సుభాష్ విసురుగా వెళ్ళిపోయాడు.

ఇంతలో వంటవ్వ కాఫీ కప్పులతో డ్రాయింగ్ రూంలో కెళ్తూ కన్పించింది. లాల్ ఆమె నాపాడు. "రమ ఎక్కడికెళ్ళింది?"

"అదే తెలియడంలేదు! మొదటిసారి కాఫీ లందించి నా దగ్గరికొచ్చింది. ఏదో మాట్లాడుతూ హఠాత్తుగా బయటికెళ్ళిపోయింది" అందామె.

"ఎటు?"

"నేను చూడలేదు....ఇలా హాల్లోకి వచ్చింది."

"కంగారుగా వుందా?"

"నే నామె ముఖం చూడలేదు...."

ఆమె వెళ్ళిపోయాక లాల్ సాలోచనగా రమ గది దగ్గరికెళ్ళాడు. గడియ పెట్టబడి ఉంది. లాగి లోనికెళ్లాడు. ఓసారి చుట్టూ చూసి, ఆమె దుస్తులకోసం గాలించాడు. బీరువాలో అవి భద్రంగా ఉన్నాయి. బీరువా అరలన్నీ గబగబా సోదా చేశాడు. పై అరలో బట్టలు, రెండో అరలో టాయిలెట్ వస్తువులు, మూడో అరలో చిందర వందరగా కాయితాలూ ఉన్నాయి.

లాల్ ఆ కాయితాల్ని కెలుకుతూ చూడసాగాడు. వాటిలో వివిధ శాస్త్రీయ విషయాలకు చెందిన పేపర్ కటింగ్స్, కొందరు సినీతారల ఆటోగ్రాఫులు, కొన్ని కలం స్నేహితుల ఉత్తరాలు, మూడు ఆకర్షణీయమైన కవర్లు ఉన్నాయి....

లాల్ ఆ కవర్లని పరిశీలించాడు. మూడింటి మీదా రమ చిరునామా ఒకే దస్తూరీలో ఉంది. అన్నీ హిమాయత్ నగర్ నుంచి పోస్టు చేయబడ్డాయి. పంపినవారి అడ్రసు లేదు.

లాల్ కవర్లలోంచి కార్డుల్ని బయటికి లాగాడు. జపాన్ ఫ్లవర్స్ గ్రీటింగ్ కార్డులు. ఆకర్షణీయంగా వున్నాయి. అవి యే సందర్భంగా పంపబడ్డాయో లాల్ తేదీల్ని చూశాడు. పోస్టల్ ముద్రలు వారానికో కవరు పంపినట్టు తెలియజేస్తున్నాయి. చివరి కవరు మొన్న అందింది.

లాల్ కార్డ్సుని తిప్పి చూశాడు. వెనుక అదే దస్తూ

రీలో అక్షరాలు కన్పించాయి. మొదటి కార్డుమీద బుధ వారం సాయంత్రం 5-30, పబ్లిక్ గార్డెన్స్ అని; రెండవ కార్డుమీద మంగళవారం మధ్యాహ్నం 3-00, సెల్లింగ్ అని; మూడవ కార్డుమీద సోమవారం సాయంత్రం6-00; కంపాలా అనీ ఉన్నాయి. ఈ చివరి కార్డు మొన్న శని వారం అందింది. నిన్న సోమవారం. కార్డు లన్నిటిమీ దా జైపాల్ అని సంతకముంది.

లాల్ వాటిని మడిచి జేబులో పెట్టుకొని గదిలో మరోసారి చుట్టూ చూశాడు. ఈసారి మంచంక్రింద ఆమె చెప్పులు కన్పించాయి. ఇంతలో బయట పెద్దగా కేక విన్పించడంతో అదిరిపడి ఉరికాడు. అప్పుడే సుభాష్ డ్రాయింగ్ రూంలోంచి భూతాన్ని చూసినట్టు పరిగెత్తి వచ్చాడు.

లాల్ వెళ్ళి అతన్ని పట్టుకొన్నాడు, "ఏమిటి? ఏం జరి గింది?"

సుభాష్ విపరీతంగా వణికిపోతున్నాడు.

"లోపల—అక్కయ్య—"

"ఆమెకేమయింది?"

"ఓహ్, చనిపోయింది!"

లాల్ అతన్ని వదలి మెరుపులా లోనికెళ్ళాడు. అతని వెనుక ఉమేష్ ఉరికాడు. రేణుక సోఫాలో పడిపోయి ఉంది. ఆమె కళ్ళు విశాలంగా విచ్చుకొని, నిశ్చలంగా చూస్తున్నాయి. చెంపలు ఎర్రబడ్డాయి. దవడలు రెండూ గట్టిగా అతుక్కొని, పెదిమల మధ్యనించి నురుగు వస్తోంది. చూస్తూండగానే ఆమె దేహం వేగంగా ఎర్ర బడసాగింది....

ఉమేష్ ఒక కేక పెట్టి ఆమె మీద పడ్డాడు.

"పిన్నీ! ఓహ్ పిన్నీ! ఏమిటిది!"

లాల్ టీపాయ్‌మీద చూశాడు. రెండు ఖాళీకప్పులు, ఒక పింగాణీ పాత్రలో పంచదార, స్పూను వున్నాయి. రేణుక తాగిన కప్పులో అడుగున తెల్లటి పదార్థం స్ఫటికలుగా మెరుస్తోంది.

లాల్, ఉమేష్‌ని లేపి బయటికి తీసుకెళ్ళాడు. తలుపు దగ్గరకు వేసి కృష్ణన్‌కు ఫోన్ చేశాడు.

"కృష్ణన్! వెంటనే బయలుదేరి రండి—వి.కాంత్ ఇంటికి. సుసైడ్ కేసు. సైనేడ్ అనుకుంటాను.... రేణుక తీసుకుంది. త్వరగా రండి!"

లాల్ ముక్కలు ముక్కలుగా చెప్పి ఫోను పెట్టేశాడు. సుభాష్, ఉమేష్‌లు గోడవారగా నిలబడి ఏడుస్తున్నారు. వినయ్ బయట జిమ్మీతో ఆడుకుంటున్నాడు. వంటవ్వ ఏమీ అర్థంగాక దిక్కులు చూడసాగింది.

లాల్ అసహనంగా పచార్లు చేస్తుండగా ఫోను మ్రోగింది. రిసీవ రందుకొన్నాడు. అవతల జాన్ పలికాడు—

"లాల్! సుధాకర్ తప్పించుకున్నాడు!"

ఉలికిపడి, "ఎప్పుడు?" అన్నాడు లాల్.

"అరగంటయింది—అయిదు గంటలకు. ఆఫీసునుంచి బయలుదేరాక బస్సులో తికమకపెట్టి తప్పించుకున్నాడు. ఇంతవరకు జాడలేదు!"

లాల్ నిట్టూర్చి టైం చూశాడు—5-29.

"వెల్! ఇక్కడ మరొక ట్రాజెడీ! రేణుక ఆత్మహత్య చేసుకొంది...."

"ఓహ్! ఎప్పుడు?"

"ఇప్పుడే—చేసిన తప్పు తెలుసుకుంది. పశ్చాత్తా

పంతో ప్రాణాలు తీసుకుందనుకుంటాను—"

"గుడ్ గాడ్!"

"నువ్వు సుధాకర్ యింటి దగ్గర వుండు. అత చెప్పి డొస్తే అప్పుడు ఆఫీసుకు తీసుకెళ్ళు—నేను వచ్చి సంగ తేమిటో చూస్తాను!"

లాల్ ఫోను పెట్టేసి వంటవ్వ వేపు తిరిగాడు, "నువ్వు కాఫీ లిచ్చి గదిలో ఎంత సేపున్నావ్?"

"వెంటనే వచ్చేశాను."

"అప్పుడు లోపలెవరున్నారు?"

"నే నే.... నేనూ పిన్ని" ఉమేష్ అన్నాడు బలహీనంగా, "ఆమె మాట్లాడుతూ నెమ్మదిగా తాగుతోంది. నేను త్వరగా తాగేశాను. నన్నిక వెళ్ళి స్నానం చెయ్యమని చెప్పింది. వెళ్ళిపోయాను—అంతే!"

"అప్పుడు టైం ఎంతయింది?"

"చూడలేదు....అయిదూ ఇరవై అనుకుంటాను."

"ఆమె నీతో ఏం మాట్లాడింది?"

"ఆమె—ఆమె—ఒక్కసారిగా అదోలా మారిపోయింది. ఏదో మాట చెప్పింది. అర్థంగాలేదు....తాను చాలా తప్పు చేశానని చెప్పి క్షమించమంది—"

"ఏమిటా తప్పు?"

"నే నడగలేదు—నా గురించే బాధపడుతోందనుకున్నాను."

లాల్ నిట్టూర్చాడు. "నువ్వెక్కడున్నావు?" సుభాష్ నడిగాడు.

"వరండాలో నిలబడి ఆలోచిస్తున్నాను—"

"రమ ఇంకా రాలేదా?"

"లేదు."

"ఆమె యెవర్నైనా రహస్యంగా కలుసుకొం టోందా?...."

"అంటే?....ఎవర్ని?"

"ఆమె ఎవర్నైనా ప్రేమిస్తోందా?"

"తెలియదు! కానీ....అప్పుడప్పుడు సాయంత్రం బయటికెళ్ళి ఆలస్యంగా వస్తుంది"సుభాష్ ఉలికిపడ్డాడు, "బాస్! ఆమె నన్ను కాఫీకి పిలిచినప్పుడు అయిదు కావస్తోంది.... నేను పైన గదిలో కిటికీదగ్గర వున్నాను—అప్పుడు తోటలో యెవరో తచ్చాడుతుండగా చూశాను!"

"ఎవరు?"

"స్పష్టంగా చూడలేదు! రమ పిలవడంతో తిరిగివచ్చేశాను—"

11

పోలీసు సిబ్బంది వచ్చి డ్రాయింగ్ రూంలో పరిశోధన ప్రారంభించింది....

రేణుకని పరీక్షించి డాక్టర్ ఆమె పొటాషియం సైనేడ్ తీసుకుందని చెప్పాడు. ఆమెను ఫోటోలు తీసి, వేలిముద్రలు గాలించారు. కప్పుల్ని లాబ్ కు పంపేందుకు స్వాధీనం చేసుకున్నారు.

ఉమేష్ సోఫాలో తల పట్టుకొని కూర్చున్నాడు. అతని ప్రక్కన వినయ్ వొదిగి కూర్చొని అందర్నీ గమనిస్తున్నాడు—సుభాష్ ఇంకా దుఃఖాన్నాపుకోలేకపోతు న్నాడు.

పైన రేణుక గదిలో లాల్ టేబిల్ చుట్టూ తిరుగుతూ పరిశీలిస్తున్నాడు. సొరుగులన్నీ లాగి చూశాడు. క్షుణ్ణంగా గమనించాడు.

క్రింది సొరుగులో రహస్య అర బయటపడింది. ఆ

సొరుగు మిగిలినవాటికంటే లోతు తక్కువ వుంది. క్రింద వెనుక భాగంనుంచి ఒక బల్లపరుపు చెక్క స్లైడ్‌లా అమర్చి వుంది. లాల్ దాన్ని లాగి లోనికి చూశాడు. కొన్ని కాయితాలు కన్పించాయి. వాటిని తీసి చూశాడు. అవన్నీ స్వరాజ్ వ్రాసిన ప్రేమ లేఖలు.... స్వాధీనం చేసుకున్నాడు.

క్రిందికి తిరిగివచ్చాక కృష్ణన్ ఎదురుపడి అన్నాడు, "వెల్, లాల్! కేసు ముగిసింది. ఆమె చేసిన పాపానికి తనే శిక్ష విధించుకుంది. మనం చేయగల్గిందేమీ లేదు. సుభాష్‌నీ, సుధాకర్‌నీ వార్నింగ్ యిచ్చి వదిలి వేయాలి—"

లాల్ అడ్డంగ తలూపాడు, "అప్పుడే నిర్ణయానికి రాకండి! వి.కాంత్ హత్యలో స్వరాజ్ రేణుకకు తోడ్పడ్డాడు. బహుశ సుభాష్ కూడా ఆక్సెసరీ అయ్యే అవకాశం వుంది...."

"అయితే స్వరాజ్‌ని అరెస్టు చెయ్యాలా?"

"ష్యూర్—" లాల్ యింకేదో చెప్పబోయాడు—యింతలో వంటవ్వ భయంకరంగా అరుస్తూ హాల్లోకొచ్చింది. ఆమె నిలువునా కంపించిపోతూ నేలమీద కూలబడింది.

"ఏం జరిగింది? యెందుకలా వచ్చావు?" లాల్ అరిచాడు.

ఆమె నోరు పెగల్లేదు. విచిత్రంగా సైగలు చేస్తూ గుండెలు బాదుకుంటోంది.

"భయపడకు! ఏం జరిగిందో నిదానంగా చెప్పు!"

"రమ—కుప్పతొట్లో రమ—"

"ఏమయింది?"

"చచ్చిపడి వుంది!"

లాల్ మెరుపులా బయటికి పరుగుతీశాడు. అతని వెనక కృష్ణన్, సుభాష్, ఉమేష్ పరిగెత్తారు. పెరట్లో మూలగోడ దగ్గర నున్న కుప్పతొట్టి వద్దకు అందరూ చేరుకున్నారు. మసక చీకట్లో లోపల ఒక మానవాకారం అస్పష్టంగా కన్పిస్తోంది. కృష్ణన్ టార్చి వేశాడు. రమ కాళ్ళు చేతులూ మడిచి అందులో కుక్కబడి వుంది. ఆమె ముఖంమీద వంటవ్వ విసిరేసిన కూరగాయలపొట్టు వుంది-నోటినుంచి, ముక్కునుంచీ రక్తం కారి గడ్డకట్టింది....

క్షణాల్లో ఆమెను ఫోటోలు తీసి, వెలికి తీశారు. డాక్టర్ పరీక్షించి ఆమె నైలాన్ తాడుతో వురి తీయబడిందన్నాడు. ఆమె చనిపోయి యింకా గంట కూడా దాటలేదు....

పెరట్లో బట్టలారేసుకొనే నైలాన్ తాడు తెగిపోయి వుంది. పెరటితలుపు గడియతీసి, ఓరగా వేసివుంది.

"వెల్, లాల్! దీని కర్థమేమిటి? ఇది కచ్చితంగా సుధాకర్ పగ సాధింపు చర్య! అంతకంటే ఈ హత్యకు మోటివ్ లేదు!" అన్నాడు కృష్ణన్.

"అయితే మిగిలిన సంఘటనలు? రేణుక భర్తను చంపలేదా? ఆమె ఆత్మహత్య చేసుకోలేదా?"

కృష్ణన్ అడ్డంగా తలూపాడు. "నో, లాల్. సుధాకర్ అయిదుగంటలకు తప్పించుకున్నాడన్నారు. ఇక్కడికొచ్చాడేమో?"

"ఆగండి! సుభాష్ అయిదుగంటలకి తోటలో ఎవరో తిరుగుతోంటే చూశాడట! అది స్వరాజ్ అనుకొంటాను. ....అతను రేణుక దగ్గర ప్రేమలేఖలు గురించి భయపడు

తున్నాడు. వాటికోసం రహస్యంగా వచ్చాడనుకొంటాను. కానీ, రమ కంట పడ్డాడు. భయపడి, ఆమెని బయటకు పిల్చి చంపేసి పారిపోయాడేమో?"

"అది సుధాకర్ ఎందుక్కాకూడదు?"

"ఎందుకంటే ఆ సమయానికతను ఆఫీసులోనే వున్నాడు. అయిదుగంటలకి ఆఫీసు వదిలాడు. అదే సమయంలో యిక్కడ ప్రత్యక్షం గావడం అసంభవం! సుభాష్ సరిగ్గా అయిదు గంటలకి తోటలో ఆకారాన్ని చూశాడు."

"సుభాష్ కూడా వి.కాంత్ హత్యలో అక్సరీ అన్నారు. ఒకవేళ ఆ ఆకారం గురించి అతనే కల్పించి రమను చంపాడేమో?"

"ఆమె నెందుకు చంపుతాడు?"

"భద్రతకోసం—అతని గురించి ఆమెకు తెలిసి వుండ వచ్చు."

"నో, నో, యిందులో మరొక అదృశ్య వ్యక్తి ఉన్నాడు."

"ఎవరు?"

"రమ ప్రేమికుడు—అతని గురించికూడా ఆలోచించాలి. పెరటి తలుపు తీసివుంది....మీ మనుషులెక్కడ? బయటికి వెళ్ళి ఆగంతకుడి గురించి దర్యాప్తు చేయమనండి!"

కృష్ణన్ వెళ్ళిపోయాక లాల్ చీకట్లో సిగరెట్ తాగుతూ కప్పులోట్టికేసి చూస్తూ నిలబడ్డాడు. ఆమె యింకా అక్కడే కన్పిస్తోంది....అలాగే, అదేసితిలో, అదే భంగిమలో, మరో లోకంలో. హఠాత్తుగా ఆమె యీ లోకానికి దిగివచ్చి రెండు చేతులు జోడించి అరి

స్తున్నట్లు అనిపించింది లాల్ కి.

షాంతకుడిమీద కసిగా లోని కదులుతేశాడు.

హాల్లో సోఫాలో ఉమేష్, సుభాష్, వినయ్ విచార వదనాలతో కూర్చొని వున్నారు. క్రింద వంటవ్వ వెక్కి వెక్కి ఏడుస్తోంది. వాళ్ళని చూస్తున్నవాడల్లా లాల్ తక్కున ఆగిపోయి, ఏదో జ్ఞప్తికివచ్చి, వాళ్ళ గమనించకుండా గిరుక్కున తిరిగి వి. కాంత్ గదిలో కెళ్ళాడు.

సిగరెట్ పారేసి వేగంగా బీరువానీ, షెల్ఫుల్నీ, సొరుగుల్నీ గాలించాడు. చివరికి సొరుగులో దొరికిన ఒక ఫోల్డర్ తో కుర్చీలో కూర్చున్నాడు. దాన్ని తెరిచి పరిశీలించాడు. అందులో అన్నీ వ్యక్తిగత లేఖలు తేదీలవారిగా పొందుపర్చబడి ఉన్నాయి.

కానీ—వాటిలో పైన ఫైలుచేయకుండా, పంచ్ రంధ్రాల్లేని ఉత్తరాన్ని చూసి ఆశ్చర్యంగా అందుకున్నాడు.

కొన్ని క్షణాల తర్వాత అతని పెదవులు చిరునవ్వుతో మెరిశాయి.

12

జాన్ నవ్వి, "మీ కౌబాయ్ అడ్వెంచర్ కాన్సెప్ట్లో ఓ కొలిక్కి వస్తుంది" అన్నాడు.

సుధాకర్ మిర్రి చూశాడు, "నన్నిలా నిర్బంధించడం చట్టవిరుద్ధం!"

జాన్ మళ్ళీ నవ్వాడు, "కౌబాయ్ ప్రపంచంలో చట్టం ఉండదు. నేను కూడా చాలా వెస్టర్న్ సినిమాలూ, నవలలు ఎంజాయ్ చేశాను."

సరళ అంది, "ప్లీజ్, జాన్! ఆయనతో మాట్లాడకండి! ఆయన మెదడు సరిగా లేదు!"

"నీ కోసం నేనింత రిస్క్ తీసుకొని జైలుకెళ్ళడానికి సిద్ధపడుతున్నాను!"

"పూరుకోండి. ఏమీ చెయ్యకుండానే యెలా వెళ్తారు?"

ఇంతలో లాల్, వెనుక పడుతూ లేస్తూ వస్తున్న కృష్ణన్‌తో ఆఫీసులో ప్రవేశించి నోరు పెద్దగా తెరిచి నవ్వాడు.

"వెల్! ఏమంటున్నాడు మిస్టర్ సుధాకర్?"

"రేణుకను కూడా చంపాడట!" జాన్ అన్నాడు.

"బ్రేవో మిస్టర్ సుధాకర్! మరి రమను?"

"నేనే! ఆమెను కూడా నేనే చంపాను!" సుధాకర్ బల్లమీద గుద్దాడు. "నేను ప్రతిజ్ఞ చేశాను. అవునా? ఇప్పుడు నెరవేర్చుకొంటున్నాను! నన్ను వదిలి చూడండి, మిగిలినవాళ్ళనుకూడా అంతంచేసి స్వయంగా జడ్జీ దగ్గర చెప్పుకొని మరీ జైలు కెళ్తాను!"

"జడ్జీ కాదు గదా యముడి దగ్గర చెప్పుకున్నా గెట్ అవుట్ అంటాడు."

"ఇంతకీ మీ రిప్పుడేమంటారు?"

"మీ బడాయి నోరు మూసుకోమంటాను. మీరు చెయ్యని పనులకి చంకలు కొట్టుకోవద్దంటాను! మీలో పౌరుషం వుందిగానీ, అది ఆచరణలో పనికిరాదు. మీ వైఫల్యాలు అసంతృప్తి ఫలితంగానే ఇతరులు చేసే ఘనకార్యాల్లో మిమ్మల్ని వూహించుకుని మనశ్శాంతి పొందే అవలక్షణం వచ్చింది మీకు! అదెంత ప్రమాదకరమో మీరు తెలుసుకోలేరు. మీ బుకాయింపులతో మా మతులు పోగొట్టి తప్పుడు మార్గాలను పట్టించారు. జాన్ మిమ్మల్ని కనిపెడుతున్నాడని తెలిసి, ఆఫీసునుంచి

తెలివిగా అతని దృష్టినుంచి తప్పించుకొని, షికార్లకొట్టి తిరిగివచ్చారు. ఖర్మకాలి ఆ సమయంలోనే రెండు హత్యలు జరిగాయి.

"కాబట్టి సుధాకర్ మీరు పిచ్చిగా మాట్లాడకండి! ఎర్రగడ్డకు పంపే యేర్పాటు చేయగలను....మీ మాటలు పిచ్చాసుపత్రి వాళ్ళకు బావుంటాయి.

"వెల్ ఫ్రెండ్! యిక యీ హత్యలు గురించి చెప్పుకుందాం. మొదటి హత్య వి. కాంతని రమ చంపిందని మనవి చేసుకొంటున్నాను."

"రమ చంపిందా!" దాదాపు అందరూ ఒకేసారి అరిచారు.

"అవును. రమ చంపింది!" మళ్ళీ అన్నాడు లాల్. "కానీ బుద్ధిపూర్వకంగా కాదు. అది ప్రమాదవశాత్తున జరిగింది. పూర్ గర్ల్! అమాయకంగా నమ్మి మోస పోయింది! ఆమెకు అంకుల్‌ని చంపుతున్నట్టు తెలియదు. ఆమె కలిపింది ప్రాణం తీసే విషమని అసలు తెలియదు!"

"మరి ఏమనుకొని కలిపింది?"

"కృష్ణన్, మీ రిటీవల' ట్రూత్ డ్రగ్స్' గురించి వినే వుంటారు—నిజాన్ని కక్కించే మందు. ఇంకా వాడకం లోకి రాలేదుగానీ పరిశోధనలు సాగుతున్నాయి. ఏదో సైన్స్ మాగజైన్‌లో చదివినట్టు గుర్తు....టాక్సిన్ మూల పదార్థంగా మరికొన్ని రసాయనాల కలయికతో అలాటి మందును రూపొందించవచ్చునని శాస్త్రజ్ఞులు ప్రకటించారు.

"సైన్స్ కేదేనా సాధ్యమే. ఎవరైనా మాంత్రికుడు మిమ్మల్ని పట్టుకొని యింద్రజాల మహేంద్రజాలంతో కప్పగా మార్చేస్తానంటే మీరు నమ్మకపోగా, నవ్వి

శోధన చేస్తారు. అలాంటి విద్యల్ని నమ్మే రోజులు పోతాయి. అదే ఎవరైనా సైంటిస్టు మీ దేహంలో కొన్ని ప్రత్యేక గ్రంథుల్ని ప్రవేశపెట్టి కప్ప లక్షణాలు సృష్టించగలనంటే తేలిగ్గా నమ్మేస్తారు. సైన్స్‌పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం అలాంటిది.

"ఇక సైన్స్ రంగంలో కొత్తగా కనిపెడుతున్న విషయాల్ని ప్రత్యేకాసక్తితో గమనిస్తూ, పేపర్ కటింగ్స్‌ని పోగుచేసే రమలాంటి అమ్మాయికి ఏదో మందు చూపించి ఇదే 'ట్రూత్ డ్రగ్' అంటే గుడ్డిగా నమ్మేస్తుందని చెప్పనక్కర్లేదు."

"అంటే....ఆమెనలా ఎవరు నమ్మించారు?"

"జైపాల్—ఆమె ప్రేమికుడు. అది అతని సొంత పేరనుకోను. అతన్ని ఆమె కొంతకాలంగా రహస్యంగా కలుసుకుంటోంది. అతన్ని బాగా నమ్మింది. బహుశ అతను పెళ్ళికి కూడా నమ్మించి వుంటాడు. అంతేగాక తను చాలా మోసపోయినట్టూ, దగాపడినట్టు కూడా చెప్పుకొని వుంటాడు. రమ బాధపడి వుంటుంది.

అతను వి. కాంత్ కంపెనీలో చాలా డబ్బు నష్టపోయానని బుకాయించాడు. ఆ డబ్బు సంపాదిస్తే తప్ప తనకు జీవనాధారం లేదు. ఇది తెలిసి రమ అతనికి సహాయపడాలనుకుంది. ఇద్దరూ మార్గం ఆలోచించారు. అప్పుడతను యీ పథకం వేశాడు. ట్రూత్ డ్రగ్ గురించి ప్రస్తావించి వి. కాంత్ మీద దాన్ని ప్రయోగించి నిజం కక్కించాలని చెప్పాడు.

రమ వెంటనే ఒప్పుకొంది. ఆమెకా మందు గురించీ, దాని ప్రభావం గురించీ చాలా కుతూహలంగా వుంది. పథకం ప్రకారం నిన్న సాయంత్రం అతను దాన్ని ఆమె

కిచ్చి ఉదయం టిఫిన్‌లో కలపమన్నాడు. అప్పుడతను ఆఫీసుకొచ్చాక తను అక్కడికెళ్ళి నిజం చెప్పిస్తానని అన్నాడు—

"అంతే! రమ చెప్పినట్టు చేసేసింది. ఆ మందు ఉదయం జామ్‌లో కలిపింది. కానీ వి. కాంత్ ను సీరియస్‌గా వుందని మీరు ఫోన్ చేసినప్పుడు బెదిరిపోయింది. ఏదో పొరపాటు జరిగిందని కంగారుపడింది. అందుకే ఆ బాటిల్‌ని శుభ్రంగా తుడిచిపారేసి కొత్త బాటిల్‌ని అక్కడ వుంచింది."

"సరే, అయితే జైపాల్ అసలు పేరేమిటి?"

"ఉమేష్ బాబు, అఫ్‌కోర్స్."

"వాట్! నేను నమ్మను. అసంభవం! అసాధ్యం!"

"సాధ్యమే! ఉమేష్‌బాబు యీ రెండేళ్ళు సమాజంలోని అట్టడుగు వర్గాల మధ్య, యింకా నిమ్నస్థాయి సంస్కృతికి అలవాటుపడ్డ కుర్రాడు. అతనికి కారెక్టర్ లేదు. ఇంకా మాట్లాడితే మానవత కూడా లేదు. అదుగడుగునా నేరాలతో పోలీసుల వేటకి గురయ్యాడు. ఆ బ్రతుకుతో విసిగిపోయాడు. ఇక అతని ఆలోచనలెలా వుంటాయో వూహించండి.

"అతనికి విశ్రాంతి, భద్రత, స్థిరత్వం కావాలి. అవెక్కడా కన్పించలేదు—తండ్రి దగ్గర తప్ప. కాని తండ్రి దగ్గర సంబంధాలు లేవు. పైగా పిన్నితో పడదు. ఆ యింటికి తిరిగి వెళ్ళాలంటే ఆమె అక్కడ వుండకూడదు. అయినా తండ్రి ఆదరిస్తాడని నమ్మకమేమిటి? అందుకే అతను బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తను కోరుకొనే సౌఖ్యాల కోసం తిరిగి యింటికెళ్ళాలనుకొంటే అక్కడ పిన్ని, తండ్రీ కూడా

వుండకూడదు."

"చెప్పండి. మీ రేమీ ఆగనవసరం లేదు!"

"ఊపిరి పీల్చుకోనివ్వండి! ఆల్ రైట్, అందుకే అతను యిక్కడికొచ్చాడు. అంటే బెంగుళూరు విడిచి పెట్టాడు. చాలా కాలంగా యిక్కడే మసలుతున్నాడు. ఇక్కడి వాళ్ళను జాగ్రత్తగా గమనిస్తూ పథకం ఆలోచిస్తున్నాడు. ముందు రమను బయటకు లాగి ప్రేమలో దింపాడు. అతనెవరో ఆమెకు తెలియదు. తనంటే ఆమె పడిచచ్చేలా గుప్పిట్లో బిగించి, యిక రంగంలో దిగడానికి సిద్ధమయ్యాడు.

"అతని పథకంలో నాయకుడు మిస్టర్ సుధాకర్" సుధాకర్ని ఓరగా చూస్తూ మళ్ళీ అన్నాడు లాల్, "సుధాకర్ ఉద్రేకాన్నీ, స్వభావాన్నీ అతను బాగా స్టడీ చేశాడు. దాని ప్రకారం అంచనాతో సరళమీద దొంగతనాన్ని ఫేక్ చేశాడు—సుభాష్ ఏమీ చెయ్యలేదు. అతను శుద్ధ అమాయకుడు.

"ఉమేష్ మొన్న రాత్రి తాళాలు దొంగిలించి ఆఫీసులో ప్రవేశించి వెంటతెచ్చుకున్న బ్యాగ్లో డబ్బు నింపుకొని తిరిగి ఆఫీసుకు తాళాలు వేసుకొని వెళ్ళిపోయాడనీ, ఉదయం సరళ ఆఫీసు తెరిచాక అతను బాల్కనీలో కిటికీ దగ్గర పొంచివుండి సుభాష్ వినయ్తో రాకముందే లోనికి దూకి బ్యాగులో పడేసి వెళ్ళిపోయాడనీ సులభంగా వూహించవచ్చు.

"వెల్! వి. కాంత్ సరళ మీద దొంగతనం మోపాడు. అరెస్టు చేయడానికి పోలీసులొచ్చారు. ఇంతలో తుఫాను గాలిలా సుధాకర్ వచ్చి రభస చేశారు. ఆ వార్త మీకు నిమిషాలమీద ఎలా తెలిసిందో

నా కష్టదరం గాలేదు. ఇప్పుడరమవుతోంది. మీకు యెవరో ఫోన్ చేసి చెప్పారు. అవునా?"

"అవును మిస్టర్ లాల్. ఎవరో నాకు ఫోన్ చేసి సరళ మీద వి. కాంత్ దొంగతనం మోపి అరెస్టు చేయిస్తున్నట్టు చెప్పాడు. అంతేకాదు, వి. కాంత్ మోసగాడనీ, అతని కంపెనీ ఫ్రాడ్ అనీ, తను చాలా డబ్బు నష్టపోయాడనీ కూడా చెప్పాడు. అతనిమీద ఎలాగైనా పగతీర్చుకోమని నన్ను రెచ్చగొట్టాడు."

కృష్ణన్ విస్తుపోయాడు,

లాల్ నవ్వాడు. "చూశారా? ఉమేష్ సుధాకర్ని రెచ్చగొట్టి యెలా కత్తుబూనేలా పురిగొలిపాడో? అఫ్ కోర్స్ సుధాకర్ది ఒట్టి ఉద్రేకమేనని అతనికి తెలుసు. దాన్ని తెరగా ఉపయోగించుకోవాలని అతని ఉద్దేశం. వెల్ సుధాకర్ ఛాలెంజ్ చేశారు. ఉమేష్ నడుం కట్టాడు.

"సుధాకర్ ఇంట్లోనే గన్నేరు విత్తనాల్ని సేకరించి వాటి పొడిని నిన్న సాయంత్రం రమకిచ్చి ట్రూత్ డ్రగ్స్ పథకం బుకాయించాడు. రమ అమాయకంగా నమ్మేసి తానూహించని పాపానికి ఒడిగట్టింది. ఇంతలో టెలిగ్రాం వచ్చింది. దాన్ని అతను బెంగుళూరులో ఫ్రెండ్తో ఏర్పాటు చేసుకున్నాడు. సాయంత్రం సూట్కేసుతో యింట్లో దిగాడు."

"ఆ తర్వాత. అప్పుడేం జరిగింది?"

"మరో రెండు హత్యలు జరిగాయి. రేణుక, రమ చనిపోయారు. ఎవరి చావు ముందో మీకు తెలుసా?"

"రేణుకది కాదా?"

"కాదు." లాల్ ముఖం కఠినంగా మారింది. "ముందు

రమ చనిపోయింది. సుభాష్ అయిదు గంటలకి తోటలో ఎవరొన్నో చూశాడనీ, అది స్వరాజ్ గా నేను భావించినట్టు చెప్పాను గుర్తుందా? ఇప్పుడది స్వరాజ్ కాదు, ఉమేష్. అతనింటికొస్తే రమ ఆశ్చర్యపడి అనుమానించవచ్చు. అవునా? ఆమెకు నిజం తెలిసి అతని భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. ఏమంటారు? కాబట్టి ఆమెను చంపేశాడు. అతని ప్రేమా పెళ్ళి పథకంలో భాగం.

"అతను యింట్లోకి రాక ముందు పెరట్లో నిలబడి కిచెన్ లో రమను పిల్చాడు. అతన్ని చూసి ఆమె ఆశ్చర్యపడింది. గాభరాగా వెళ్ళింది. ఉదయంనించీ ఆమె అతన్ని కలుసుకోవాలని చాలా నెర్వస్ గా వుంది. అప్పుడతను మాట మాత్రం లేకుండా నైలాన్ తాడుతో ఉరితీసి కుప్పతొట్లో కుక్కి పెరటితలుపు తీసివుంచి సూట్ కేసు పట్టుకొని చక్కా యింట్లో కొచ్చాడు."

"వాడు! వాడెంతటి దుర్మార్గుడు?" సరళ అంది పళ్ళు బిగించి.

"పరమ కిరాతకుడు. ప్రాణాల్ని మంచినీళ్ళ ప్రాయంగా తోడేశాడు. నాకే మాత్రం అనుమానం రాలేదు. నిజంగానే పూర్ణించి దిగాడనుకున్నాను. అతనిలో ఏ బెరుకూ లేదు! ఏ పాటి తొట్రుపాటూ లేదు! పిన్ని దగ్గర చాలా సహజంగా, అమోఘంగా నటించాడు!

"అప్పుడు—వాళ్ళిద్దరు కాఫీ తాగుతున్నప్పుడు గదిలో యెవరూ లేరు. ఆ అవకాశంతో ఆమె కాఫీలో విషం కలిపాడు. చాలా సులభం! ఆమె కనిపెట్టకుండా ప్రక్కనే కూర్చున్నాడు. జేబులోంచి సైనైడ్ తీసి, చెయ్యిని పింగాణి పాత్రలోకి పోనిచ్చి చక్కెర తీస్తు

న్నట్లు నటించి, సైనైడ్ ఆమె కప్పులో పోస్తూ 'చూడు పిన్నీ నీ కప్పులో నువ్వు తాగలేనంత తియ్యగా పంచదార నింపేశాను!' అని వుంటాడు. అతని చిలిపితనాని కామె నవ్వుతూ 'ఫరవాలేదులే ఉమేష్! నువ్వెళ్ళి స్నానం చెయ్యి!' అని చెప్పి వుంటుంది. అతను చేతులు దులుపుకొని చల్లగా లేచి వచ్చేశాడు."

"ఓహ్! అతన్ని కల్లోకూడా అనుమానించలేరు. ఈ హత్యలన్నీ సుధాకర్, సుభాష్, స్వరాజ్, రేణుక- వీళ్ళమధ్యే అల్లుకొని ఉన్నాయని భావిస్తూ వచ్చాం" అన్నాడు కృష్ణన్.

"అవును. ఉమేష్‌ని అనుమానించకపోతే ఈ హత్యలన్నీ మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్‌లా తయారయ్యేవి."

"అతన్ని నువ్వెలా అనుమానించావు?" అడిగాడు జాన్.

"ఉమేష్ రాక నాకు తర్వాత అనుమానం కలిగించింది. వి. కాంత్ లాయర్‌కు ఉమేష్ వస్తున్నట్లు తెలియదు. వి. కాంత్ చెప్పలేదు. కాని తండ్రే ఉత్తరం వ్రాసి తనని రమ్మన్నట్లు ఉమేష్ చెప్పాడు. అలాగే వస్తున్నట్లు జవాబు కూడా యిచ్చానన్నాడు. నాకేదో అసహజంగా తోచింది. కుమారుడ్ని రమ్మని కోరివుంటే వి. కాంత్ లాయర్‌తో యెందుకు చెప్పలేదు? ఉమేష్ మాటల ప్రకారం అతని ఆరోగ్యం చెడి, బాధ్యతల్ని కుమారుడికి కప్పగించాలనుకున్నప్పుడు లాయర్‌తో ఎందుకు సంప్రదించలేదు? సంప్రదించకుండా ఎవరైనా వుంటారా?

"వ్యవహారం ఏమిటో తెలుసుకుందామని ఉమేష్ వ్రాసిన ఉత్తరంకోసం వి.కాంత్ ఫోల్డర్ తిరగేశాను. అందులో అన్నీ పర్సనల్ లేఖలున్నాయి. వాటిపైన ఈ

ఉత్తరం దొరికింది—ఉమేష్ ఇరవై రోజుల క్రితం వ్రాసి నట్టు లేదీ చెప్తోంది. మామూలు కాయితం. కవరు, పోస్టల్ ముద్రలు లేవు. ఇది మిగతా ఉత్తరాల్లాగా వరుసక్రమంలో ఫైలుచేసి లేదు. పంచ్ రంధ్రాలు కూడా లేవు. కాబట్టి మీకేమర్థమవుతోంది?"

"ఉమేష్ సాయంత్రం వచ్చినప్పుడు దీన్ని రహస్యంగా జారవిడిచాడా?"

"దటీజ్ రైట్! అతడు టైమింగ్‌ని చాలా నేర్పుతో అమలు జరిపాడు. ఏ సమయంలో యెక్కడేది జరగాలో అవి నిరాటంకంగా జరిగిపోయాయి. తండ్రి రమ్మని అతనికి వ్రాయలేదు."

"ఇప్పటికీ అతన్ని హంతకుడిగా ఎలా అనుమానిస్తున్నావో అర్థంగావడంలేదు!"

లాల్ జేబులోంచి మూడు గ్రీటింగ్ కార్డుల్ని తీసి అందించాడు.

"ఇవి రమకు అందాయి—ఆమె ప్రేమికుడు జై పాల్ నుంచి. వెనుక అక్షరాల్ని చూడు—దస్తూరీ ఈ ఉమేష్ ఉత్తరంతో సరిపోతుంది."

జాన్ చూసి తలూపాడు.

"పార్ట్‌నర్! ఈ ఉత్తరం జారవిడచి ఉమేష్ ఘోరమైన పొరపాటు చేశాడు!

"దట్సాల్, ఇనస్పెక్టర్. విష్యూ గుడ్‌లక్!"

లాల్ లేచి నిలబడి చెయ్యి అందించాడు.

—:ఐపోయింది:—